అనుదినం... జనస్వరం
మంచిర్యాల
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నవతెలంగాణ 9వ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక
8 పేజీలు | శనివారం 31 ఆగస్టు 2024 | www.navatelangana.com

మంచిర్యాల చేపకు డిమాండ్..!

- దేశ స్థాయిలో ఆదరణ
- పుష్కలమైన జలవనరులు
- జిల్లాలో చేప పిల్లల పునరుత్పత్తి కేంద్రం ఏర్పాటు

10వేల మందికి జీవనాధారంగా ప్రాజెక్టులు, చెరువులు

మంచిర్యాల జిల్లా చేపలకు దేశస్థాయిలో డిమాండ్ ఉంది. ఇక్కడి జలాశయాల్లో దొరికే చేపలు దేశ రాజధాని వరకు సరఫరా అవుతుంటాయి. భారీ నీటి ప్రాజెక్టులతో పాటు చెరువులు కుంటల్లో టన్నుల కొద్దీ చేపల ఉత్పత్తి ఉంది. వేల సంఖ్యలో మత్స్యకారులకు ఉపాధి దొరుకుతుంది. ఎల్లంపల్లి వద్ద రూ.100 కోట్ల వ్యయంతో నిర్మించనున్న చేప పిల్లల పునరుత్పత్తి కేంద్రం జిల్లాకే తలమానికం కానుంది.



నవతెలంగాణ-హాజీపూర్

వివరాలు 8లో...

కనువిందు చేస్తున్న కవ్వాల్ అభయారణ్యం

- అహ్లాదాన్ని పంచుతున్న అటవీ ప్రాంతం
- పర్యాటకులకు అనువైన సమయం
- పచ్చదనం పరుచుకున్న ప్రకృతి వనం
- ఆతిథ్యం ఇచ్చేందుకు సిద్ధంగా హరిత రీసార్ట్

మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని కవ్వాల్ అటవీ ప్రాంతం కనువిందు చేస్తోంది. అభయారణ్యంలో పచ్చని వాతావరణం, పరుగులు తీసే దుప్పులు, జింకలు, నెమళ్లు, పక్షుల కిలకిల రాగాలు, గలగలా పారే సెలయేర్లు, వాగులు వంకలతో అహ్లాదాన్ని తిలకించేందుకు పర్యాటక ప్రేమికులు వస్తుంటారు. కవ్వాల్ టైగర్ జోన్‌లో ఓపెన్ ట్రాప్ జీపు(సఫారీ)లో సవారీకి వెళ్లేందుకు ఆసక్తి చూపుతారు.

నవతెలంగాణ-జన్నారం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మూడు అభయారణ్యాల్లో ప్రముఖమైంది కవ్వాల్. కమనీయంగా కనిపించే ఈ అభయారణ్యం మంచిర్యాల, నిర్మల్ రెవెన్యూ డివిజన్ల మధ్య విస్తరించి ఉంది. కవ్వాల్ అభయారణ్యం పరిధిలోని జన్నారంలో వన్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి అందులో వన్య ప్రాణులను సంరక్షిస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడకి వచ్చే పర్యాటకులకు వన్యప్రాణులు కనువిందు చేస్తాయి. జన్నారంలోని వన్యప్రాణి సంరక్షణ విభాగంలో దుప్పులు, జింక పిల్లలు, నెమళ్లు, నీలుగాయిలను ఉంచడంతో వీటి సందర్శన కోసం వందలాది మంది పర్యాటకులు ఈ కేంద్రానికి వచ్చి ప్రకృతి అందాలతో పాటు వన్యప్రాణుల మధ్య కాలం గడుపుతూ ఆహ్లాదం పొందుతారు. సెలవు దినాల్లో పర్యాటకులు ఎక్కువగా వన్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని సందర్శిస్తుంటారు.



వందకు పైగా జీవాలు

జన్నారం మండల కేంద్రం నుంచి లక్షెట్టిపేట వైపు వెళ్లేదారిలో అర కిలోమీటర్ దూరంలో ఈ జింకల పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో ప్రస్తుతం 60 దుప్పులు, 12 సాంబార్లు, 12 నీలుగాయిలున్నాయి. వాటికి అటవీ శాఖ సిబ్బంది ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం ఆహారం అందిస్తారు. వాటి కోసం హైదరాబాద్ నుంచి ప్రత్యేకమైన ఆహార ధాన్యాలు తీసుకువస్తారు. అదే విధంగా సమీపంలో ఉన్న చెట్ల ఆకులను వేస్తారు. ఎక్కడో అడవిలో ఉండే వన్యప్రాణులు చెంగుచెంగున ఎగిరే దుప్పులు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి

జన్నారం టైగరజోన్‌కు చేరుకునే మర్గాలు

ఆదిలాబాద్ నుంచి మంచిర్యాల, కాగజ్‌నగర్ పట్టణాలకు, మంచిర్యాల నుంచి ఆదిలాబాద్, నిర్మల్ పట్టణాలకు వెళ్లే వారు ఇక్కడా సేద తీరవచ్చు. పక్కనే అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేసి నర్సరీల్లో సేదతీరి భోజనాలు చేసే సౌకర్యాలు ఉన్నాయి. ఇక్కడికి రావడానికి ఆదిలాబాద్ నుంచి 100కిలోమీటర్లు, మంచిర్యాల నుంచి 60 కిలోమీటర్లు, నిర్మల్ నుంచి 80 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఇక్కడికి వచ్చేందుకు మంచిర్యాల, వరంగల్, హైదరాబాద్, కరీంనగర్ పట్టణాల నుంచి బస్సు సౌకర్యాలున్నాయి. ప్రయివేటు వాహనాలు ద్వారా కూడా రావచ్చు. హైదరాబాద్ నుంచి 250 కిలోమీటర్ల దూరం ఉంటుంది. మండల కేంద్రంలోనే ప్రధాన రహదారికి పక్కనే ఉండడంతో అందరు చూసేందుకు వీలుగా ఉంటుంది. పర్యాటకులకు బస చేసేందుకు సౌకర్యవంతమైన రిసార్టు, అధ్యయన కేంద్రం, ఆకట్టుకునే బొమ్మలు కూడా ఉన్నాయి.

కవ్వాల్ శాంక్చురీ ఏర్పాటు

భారీ కీకారణ్యం కావడంతో జన్నారం అటవీ డివిజన్‌ను కలుపుకొని ప్రత్యేకంగా కవ్వాల్ శాంక్చురీ(అభ్యరణ్యం) డివిజన్‌ను నూతనంగా ఏర్పాటు చేశారు. ఈ శాంక్చురీ 1965లో ఏర్పడింది. అనంతరం దీని పరిధిలో నాలుగు అటవీ క్షేత్రాలును గుర్తించారు. ఇందన్‌పల్లి, తాళ్లపేట, బీర్సాయిపేట్,



జన్నారంలో ఈ అటవీ క్షేత్రాలను ఏర్పాటు చేశారు. దీనికి తోడు పులులు సంచరించే ప్రాంతం కావడంతో ఈ అభయారణ్యంలో ఉన్న 24 చదరపు కిలోమీటర్ల దూరాన్ని కోర్ ఏరియాగా గుర్తించారు. ఈ అడవుల్లో నాణ్యమైన టేకు, సీసంకట్టె, తుమ్మ, వెదురు వంటి విలువైన అటవీ సంపద ఉంది.

పర్యాటక శాఖ ప్రత్యేక సౌకార్యాలు



ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు పర్యాటక శాఖ అధికారులు హరిత రెస్టారెంట్, కాటేజీలు నిర్మించి పర్యాటకులు బస చేసేందుకు సౌకర్యం కల్పించారు. ఇక్కడికి వచ్చిన పర్యాటకులు జంగిల్ సఫారీ ద్వారా సుమారు 30 కిలోమీటర్ల దూరం అడవిలో ప్రయాణించవచ్చు. అడవిలో ఉదయం పూట 6 గంటల్లోపు వెళితే వన్యప్రాణుల పరుగులు పక్షుల కిలకిలరావాలు వినవచ్చు. దట్టమైన అడవిలో పచ్చని చెట్ల మధ్య ప్రయాణం, అక్కడక్కడా వన్యప్రాణుల పరుగులు, ఆహ్లాదాన్ని నింపుతాయి. దట్టమైన అడవీ ప్రాంతంలో మల్యాల అడవుల్లో అటవీశాఖ నిర్మించిన వాల్‌టవర్ ఎక్కి పరిశీలిస్తే చుట్టూ దట్టమైన అడవులు కనిపిస్తాయి. అదేవిధంగా పలుమార్లు అడవుల్లో సంచరించే పెద్దపులి పర్యాటకులకు కనిపించి ఆందోళన కలిగిస్తోంది.

అతిథి గృహాలు..

జింకల పునరావాస కేంద్రంతో పాటు ఇక్కడి అభయారణ్యంలో అతిథి గృహం ఉంది. ఈ అతిథి గృహంలో వెదురుతో తయారు చేసిన వివిధ రకాల వస్తువులు ఉన్నాయి. వీటితో పాటు ఇక్కడి అభయారణ్యంలో ఔషధ మొక్కల ప్లాంట్లు ఏర్పాటు చేశారు. పచ్చదనం పరవశిస్తూ ఎత్తైన వృక్షాలతో ఈ అరణ్యందర్శన మిస్తూ పర్యాటకులను ఇట్టే కట్టి పడేస్తుంది. ఇక్కడి కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రంలో చెంగున ఎగిరే జింకలు, పురివిప్పి నాట్యం చేసే నెమళ్లనుఇక్కడ చూడొచ్చు. దీనికితోడు పర్యాటక శాఖ ఒక అడుగు ముందుకెసి పర్యాటకులు బస చేసేందుకు వీలుగా రూ.2.38 కోట్ల వ్యయంతో హోటల్, విడిది గదులను నిర్మించింది. ఇందులో 9 ఏసీ కాటేజీలు, రెండు నాన్ ఏసీ కాటేజీలు, పది డార్మెటరీ గదులు, ఒక ఏసీ రెస్టారెంట్ చుట్టూ అందమైన పూల మొక్కలతో ఎంతో అందంగా ఉంటుంది.

బుకింగ్ ఇలా..

కవ్వాల్ అభయారణ్యానికి పర్యాటకుల తాకిడి రోజురోజుకూపెరుగుతోంది. ఇందుకు తగ్గట్టుగా పర్యాటక శాఖ సౌకార్యాలు కల్పిస్తోంది. జన్నారం, కడెం మండలాల్లో టూరిజం శాఖ కాటేజీలను నిర్మించింది. జన్నారంలో 9 ఏసీ, 2 నాన్ ఏసీ, సమావేశాలు, చిన్నచిన్న శుభకార్యాలను వినియోగించుకోవడానికి డార్మెటరీ హాళ్లు, రెస్టారెంట్‌ను నిర్మించింది. కడెం మండలంలో 12 ఏసీ, 2 నాన్ ఏసీ గదులను టూరిజం శాఖ ఆధ్వర్యంలో నిర్మించి పర్యాటకులకు అందుబాటులో ఉంచారు. పర్యాటకుల సంఖ్య పెరుగుతుండడంతో ముందుగా ఆన్‌లైన్ ద్వారా గదులు బుకింగ్ చేసుకునేందుకు వీలు కల్పించింది. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎస్‌టీడీసీ.ఇన్‌కు లాగిన్ అయి ఎంచుకోవాలి. ఏసీ గదికి రూ.1,654, నాన్ ఏసీ గదికి రూ.1000 అద్దె చెల్లించాల్సి ఉంటుంది.

పర్యాటకులకు అన్ని సౌకర్యాలూ కల్పిస్తున్నాం

శివ్ అసిస్ సింగ్, డీఎఫ్ఓ మంచిర్యాల



జన్నారంలోని కవ్వాల్ అభయారణ్యానికి పర్యాటకుల తాకిడి పెరిగింది. వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఉదయం జంగిల్ సఫారీ ద్వారా అడవుల్లోకి తీసుకెళ్లి, అన్ని ప్రాంతాలను చూపిస్తున్నాం. పెరుగుతున్న రద్దీ దృష్ట్యా ముందుగా ఆన్‌లైన్‌లో టికెట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. రాబోయే రోజుల్లో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తాం.




నిబద్ధతకు ఆదర్శం నవతెలంగాణ

- సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు జాడి గంగాధర్

నవతెలంగాణ-జన్నారం

ప్రజా సమస్యలు వెలికి తీయడంలో నవతెలంగాణ ముందు వరుసలో ఉంటుందనిసర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు జాడి గంగాధర్ అన్నారు. నవతెలంగాణ వార్షికోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రిక విజయవంతంగా 9వ వార్షికోత్సవం జరుపుకుంటున్న యజమాన్యానికి, విలేకరులకు, సిబ్బందికి, ప్రత్యేక అభినందనలు తెలిపారు. అంకితభావంతో పనిచేస్తున్న విలేకరులు, సిబ్బంది ఈ పత్రికకు ఆయువు పట్టని, సమాజం పట్ల గౌరవం, ప్రజల పట్ల నిబద్ధతతో పని చేస్తున్న పత్రిక నవతెలంగాణ అని, ప్రజా కోణంలో వార్తలు, విశ్లేషణలు అందిస్తూ ఎప్పటికప్పుడు నూతన ఉత్తేజంతో నవతెలంగాణ పాఠకులకు చేరువవుతోందన్నారు. 9 సంవత్సరాలు పూర్తి చేసుకుని 10వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా పత్రిక ఉన్నతికి కారణమైన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలుపుతు భవిష్యత్తులో ఇది మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.



ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధి నవతెలంగాణ

నవతెలంగాణ-మంచిర్యాల



ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ స్థానిక సమస్యల పరిష్కారానికి నవతెలంగాణ పత్రిక కృషి చేస్తుందని మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్ అన్నారు. నవతెలంగాణ 9వ వార్షికోత్సవం సందర్భంగా యాజమాన్యానికి, సిబ్బందికి శుభాకాంక్షలు తెలుపుతూ మాట్లాడారు. సామాన్య ప్రజల నమ్మకం నవతెలంగాణ అని అన్నారు. వార్త కథనాలతో సమస్యలు సాధన కోసం నవతెలంగాణ పత్రిక కృషి చేస్తుంది. ప్రజలను చైతన్య పరిచే అంశాలను రాస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తున్న నవతెలంగాణ పత్రిక రాబోయే రోజుల్లో మరింత గొప్ప స్థాయికి చేరాలి.

నిజాలను నిర్భయంగా రాసే పత్రిక

- తహసీల్దార్ కత్రోజు రమేష్



నవతెలంగాణ-వేమనపల్లి

ఎవరికి తలొగ్గకుండా నిజాలను నిర్భయంగా రాసి ప్రజలకు చేదోడు వాదోడుగా ఉండే పత్రిక నవతెలంగాణ. ప్రజా సమస్యలను వెలికి తీసి పరిష్కారం కోసం అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో నవతెలంగాణ పత్రిక కీలక పాత్ర పోషిస్తోంది. తొమ్మిదో వసంతంలోకి అడుగుపెడుతున్న నవతెలంగాణకు ప్రత్యేక శుభాకాంక్షలు.

ముందుకు రండి మేమున్నాం

- అతివలకు అండగా 'షీ' టీం
- ధైర్యంగా ఫిర్యాదు చేయాలి : షీ టీం ఇన్‌చార్జి హైమ

నిత్యం ఈవ్ టీజింగ్, వేధింపులు ఎదుర్కొంటున్న యువతులు, విద్యార్థినులకు అండగా నిలుస్తుంది షీ టీం పోలీస్ సిబ్బంది. వారి పని తీరుపై జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ అండగా ఉన్నామనే భరోసా కల్పిస్తున్నారు. బాధితులు తమకు ఫిర్యాదు చేస్తే నిందితుల పై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ధైర్యం ఇస్తున్నారు. పోకిరీలు, అకతాయిల ఆట కట్టిస్తూ అతివల భద్రతకు మేమున్నాం అంటున్నారు. మంచిర్యాల జిల్లా షీ టీం పోలీస్ సిబ్బంది. నవతెలంగాణ 9వ వార్షికోత్సవం సందర్భంగా జిల్లాలో పని చేస్తున్న షీ టీం సిబ్బంది పై ప్రత్యేక కథనం.



నవతెలంగాణ-మంచిర్యాల

వేధింపులు, ఈవ్ టీజింగ్‌లకు పాల్పడుతున్న పోకిరీల పని పట్టేందుకు షీ టీం బృందాలు జిల్లాలో పని చేస్తున్నాయి. కొందరు పోకిరీలు ఫోన్‌లలో అసభ్య మెసేజ్‌లు చేయడం, అమ్మాయిల వెంట పడటం వారిని ఇబ్బందులు పెట్టటం లాంటివి తరచు ఈ మధ్య చూస్తూనే ఉన్నాం. పైశాచిక మనస్తత్వం ఉన్న కొందరు మహిళలపై దాడులు చేసిన సందర్భాలున్నాయి. కేవలం ఫోన్ నంబర్ ఉంటే చాలు వారు అసభ్య పద జాలంతో మెసేజ్‌లు చేస్తూ రాత్రి సమయాలలో అశ్లీల వీడియోలను పంపుతూ మహిళలను మానసికంగా హింసిస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో వేధిస్తే బాధితులు ఫిర్యాదు చేస్తే తప్ప పోలీసుల దృష్టికి సమస్య రాదు. దీనిని ఆసరాగా తీసుకొని కొందరు నేరగాళ్లు మరింత రెచ్చి పోతున్నారు. మహిళలు, విద్యార్థినుల చిరునామాలు తెలుసుకొని మరి వెంటాడి వేధిస్తున్నారు.

బాధ పడొద్దు... ముందుకు రండి

లైంగికంగా, సామజిక మాధ్యమాల ద్వారా వేధింపులు ఎదుర్కొంటున్న వారి కోసమే వాట్సాప్, ట్విట్టర్ సేవలను పోలీసులు అందుబాటులోకి తీసుకొచ్చారు. నిందితుడు మాట్లాడిన మాటలు, అసభ్య సందేశాలు, వీడియోలు, వాట్సాప్ ద్వారా పంపితే చాలు మిగితాది షీ టీం సిబ్బంది చూసుకుంటారు. బాధితులు ఎవరికీ చెప్పుకోలేక మానసికగా ఇబ్బందులు పడుతున్న వారి కోసం పోలీసులు ఈ సౌకర్యాన్ని కల్పించారు. వివరాలు పోలీసులు మాత్రమే తీసుకొని బాధితుల పేర్లు బహిర్గతం కాకుండా గోప్యత పాటిస్తున్నారు. ఇతరుల ఫోన్ల నుండి ఫిర్యాదు చేసిన సరే వారితో మాట్లాడి వివరాలు సేకరించి వెంటనే కేసు నమోదు చేస్తున్నారు. ఇబ్బంది పెట్టిన వారిని గుర్తించి షీ టీం పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారు.

అవగాహనా కార్యక్రమాలతో చైతన్యం

ఈవ్ టీజింగ్, మహిళలపై నిత్యం జరిగే వేధింపులపై షీ టీం పోలీసులు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలలు, బస్టాండ్, షాపింగ్ మాల్స్, వసతి గృహాల్లో షీ టీం బృందాలు వారి పని తీరు గురించి వివరిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ఫ్లెక్సీలు, పోస్టర్‌లు ఏర్పాటు చేస్తూ అవగాహన కల్పిస్తున్నారు. వేధింపులకు భరించాల్సిన అవసరం లేదని విద్యార్థినులను చైతన్య పరుస్తున్నారు. వాస్తవిక ఘటనల స్ఫూర్తితో లఘు చిత్రాలు చిత్రీకరణతో మహిళల్లో అవగాహనా పెంపొందిస్తున్నారు. స్మార్ట్ ఫోన్‌లను అందరూ వినియోగిస్తున్న దృష్ట్యా వాట్సాప్ ద్వారా ఫిర్యాదులు చేసే వెసులుబాటు కల్పించారు.

మహిళ భద్రతకే పని చేస్తున్నాం



హైమ ఎస్సై, జిల్లా షీ టీం ఇన్‌చార్జి

రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో మహిళలు, విద్యార్థినుల రక్షణ మేరకు షీ టీమ్స్ పని చేస్తున్నాయి. లైంగిక వేధింపులు, ఈవ్ టీజింగ్ బాధితులు ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నారు. సామజిక మాధ్యమాల ద్వారా వారికీ జరిగిన వేధింపులను బయట పెడుతున్నారు. యువతులు, మహిళలు ఇలా ముందుకు రావడం అభినందనీయం. ఒక్క మాట షీ టీం బృందాలకు చేస్తే చాలు వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం. బాధితులకు మేము భరోసా ఇస్తున్నాం కాబట్టే ఫిర్యాదులు క్రమంగా పెరుగుతున్నాయి. మహిళలు, విద్యార్థినులు ఎవరైనా షీ టీం నెంబర్ 6303923700కు ఫిర్యాదు చేయవచ్చు.

ఇటీవల జరిగిన ఇంటర్ పరీక్షల సమయంలో మంచిర్యాల పట్టణంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పరీక్షలు రాసేందుకు వచ్చే అమ్మాయిలను అక్కడ కొందరు ఆకతాయిలు వెంబడిస్తూ టీజింగ్ చేస్తున్నారు. బైకులతో స్టాంట్స్ వేస్తూ ఇబ్బంది పెడుతున్నారు. ఒక విద్యార్థిని ఫోన్ ద్వారా ఇచ్చిన ఫిర్యాదు మేరకు అక్కడ గస్తీ పెట్టిన షీ టీం సిబ్బంది అమ్మాయిల వెంట పడుతూ ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్న ఆకతాయిలను అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు వాహనాలు పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మరుసటి రోజు నుండి అక్కడ ఎవరు ఆకతాయిలు కనిపించలేదు పరీక్ష రాసే విద్యార్థినులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష కేంద్రాలకు వెళ్లారు.

బెల్లంపల్లికి చెందిన ఒక యువతకి కుటుంబ సభ్యులు వివాహం నిశ్చయించారు. ఇంకో 2 రోజుల్లో పెళ్లి ఉంది అనే సమయానికి యువతి బాయ్ ఫ్రెండ్ పెళ్లిని ఆపాలననే ఉదేశ్యంతో గతంలో వారిద్దరూ కలిసి దిగిన ఫోటోలు యువతికి వాట్సాప్ ద్వారా పంపాడు. వీటిని సోషల్ మీడియాలో పెడుతా అటు భయభ్రాంతులకు గురి చేశాడు. ఎటువంటి ఆందోళన చెందని యువతీ వాట్సప్ ద్వారా షీ టీం పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్పందించిన షీ టీం పోలీసులు ఆ యువకున్ని అదుపులోకి తీసుకొని యువతి పెళ్లి అయ్యే అంత వరకు కస్టడీ లో ఉంచుకున్నారు. అనంతరం ఫోన్‌లో ఉన్న ఫోటోలు తొలగించి యువకుడికి కౌన్సెలింగ్ చేసి పంపించారు.

ప్రజల గొంతుక నవతెలంగాణ

- పి.హరీశ్ చంద్రారెడ్డి ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్

నవతెలంగాణ-మంచిర్యాల



నిఖార్సైన వార్తలు రాస్తూ ప్రజల గొంతుకగా పని చేస్తోంది నవతెలంగాణ దిన పత్రిక అని మంచిర్యాల ప్రభుత్వ జనరల్ హాస్పటల్ పర్యవేక్షకులు హరీశ్‌చంద్రారెడ్డి అన్నారు. నవతెలంగాణ 9వ వార్షికోత్సవం సందర్భంగా పత్రిక యాజమాన్యానికి, సిబ్బంది కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాజంలో జరుగుతున్న అవినీతిపై సమర శంఖం మోగిస్తూ దిన దిన అభివృద్ధి చెందుతున్న నవతెలంగాణ పత్రిక రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా విశ్లేషణాత్మక కథనాలు అందిస్తుందన్నారు. ఇదే స్ఫూర్తితో నవతెలంగాణ పత్రిక కొనసాగాలన్నారు.

ప్రజల కోసం పని చేసే పత్రిక నవతెలంగాణ

- మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్

నవతెలంగాణ-మంచిర్యాల



నిరంతరం ప్రజల కోసం నవతెలంగాణ పత్రిక పని చేస్తుందని మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్ పేర్కొన్నారు. నవతెలంగాణ 9వ వార్షికోత్సవం సందర్భంగా యాజమాన్యనికి, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. దినదినాభివృద్ధి చెందుతూ ప్రజలకు మరింత చేరువ కావడం అభినందనీయం అన్నారు. సమాజంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను వెలికి తీయడంలో నవతెలంగాణ ముందుటుందన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా పత్రిక కొనసాగాలని కోరారు.

నిరంతరం ప్రజల పక్షాన నవతెలంగాణ

- వీరన్న, మండల వ్యవసాయాధికారి వేమనపల్లి



నవతెలంగాణ-వేమనపల్లి

నిరంతరం ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యలను వెలికితీసి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే పత్రిక నవతెలంగాణ. నిష్పక్షపాతంగా అనుదినం జనస్వరంగా ప్రజల పక్షాన పనిచేస్తున్నది. 9వ వసంతంలోకి అడుగు పెడుతున్న సామాన్యుడి గొంతుక ప్రజల పత్రిక నవతెలంగాణ హార్థిక శుభాకాంక్షలు. అనతికాలంలోనే ప్రజల మన్ననలు పొందుతూ సమస్య ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి పేదల పక్షపాతిగా ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేస్తున్న నవతెలంగాణ మరింత అభివృద్ధి చెందాలను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

పత్రిక రంగంలో తనదైన ముద్ర

- మంచిర్యాల పట్టణ సీఐ ఆర్.బన్సీలాల్



నవతెలంగాణ-మంచిర్యాల

పత్రికా రంగంలో నవతెలంగాణ తనదైన ముద్ర వేసుకుందని మంచిర్యాల పట్టణ సీఐ ఆర్.బన్సీలాల్ అన్నారు. నవతెలంగాణ 9వ వార్షికోత్సవం సందర్భంగా యాజమాన్యనికి, సిబ్బంధికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవతెలంగాణ జనాల్లో తమ దైన ముద్ర వేసుకొని పత్రిక రంగంలో విశిష్టతను చాటుకుంది. నవతెలంగాణ అని కొనియాడారు. ప్రజా సమస్యలను వెలికితీసి అధికారుల దృష్టికి తీసుకు రావడంలో ముందుంటుందన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ పేద ప్రజల పక్షాన నిలుస్తున్న నవతెలంగాణ పత్రిక రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చెందాలి.

నవతెలంగాణకు ప్రత్యేక అభినందనలు

- జి.పవన్ కుమార్, మండల పశువైద్యాధికారి వేమనపల్లి

నవతెలంగాణ-వేమనపల్లి



సామాజిక కోణంలో అణగారిన వర్గాల పక్షాన వార్తాకథనాలు రాస్తున్న నవతెలంగాణకు పశువైద్యాధికారి జి.పవన్ కుమార్ ప్రత్యేక అబినందనలు తెలిపారు. ప్రజా కోణంలో మరిన్ని వార్తలు అందిస్తూ, ప్రజల అభిమానాన్ని చూరగొనాలని ఆకాంక్షిస్తూ తొమ్మిదో వసంతంలోని అడుగిడుతున్న నవతెలంగాణకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

నిజాయితీ, నిబద్ధతతే.. పునాదులుగా పయనం


ఆదిలాబాద్ : ఒకప్పుడు పత్రికలంటే జనం గొంతును వినిపించి.. పాలకుల మెడలు వంచి ప్రజాస్వామ్య, లౌకికవిలువలకు రక్షణ కవచంగా నిలిచాయి. ఆ రోజుల నుంచి గుక్కతిప్పు కోలేనంత వేగంగా, పాత్రికేయత కంటే పెట్టుబడిదే పైచేయిగా మారిన మీడియా రంగం కార్పొరేట్ల కబంధ హస్తాల్లోకి వెళ్లిపోయింది. తమ బొక్కసాల్లో మూలుగుతున్న మూటలను, పలుకుబడిని రంగంలోకి దించి ఇతర మీడియా సంస్థలను దెబ్బకొట్టే ప్రక్రియ నుంచి ప్రజలను గ్లోబల్ ప్రచార మాధ్యమాల చట్రంలో ఇరికించేలా పాత్రికేయ నిబద్ధతను మృగ్యం చేస్తున్న రోజులకు తీసుకొచ్చారు. ఇలాంటి పరిస్థితుల్లోనే 'ప్రతి అక్షరం.. ప్రజల పక్షం' అన్న నినాదంతో 40ఏండ్లపైబడి ప్రజల గొంతుకను వినిపించిన 'ప్రజాశక్తి' వారసత్వాన్ని పునికిపుచ్చుకుని 'అనుదినం.. జనస్వరం' అంటూ స్వరాష్ట్రంలో 'నవతెలంగాణ'గా బయలుదేరి జనం గొంతుక నిలుస్తోంది. ఆర్థికంగా, అట్టడుగునున్న ప్రజల గొంతును వినిపిస్తూ నేడు 8 వసంతాలు పూర్తి చేసుకుంది. పత్రికారంగంలో భీష్మ పితామహులైన ఎం.చలపతిరావులాంటి వారు పత్రికలను గొలుసుకట్టు వ్యాపార సంస్థల కబంధ హస్తాల నుంచి విముక్తి చేయాలని సూచించారు. అలా చేయలేకపోతే పత్రికా స్వేచ్ఛ బతికిబట్టకట్టజాలదని ఆందోళన వ్యక్తం చేస్తూ వచ్చారు. వారి మాటలు అక్షర సత్యాలు. వారి ఆశయాలకు, ఆకాంక్షలకు భిన్నమైన పరిణామాలు చోటుచేసుకున్నాయి. పత్రికాముఖంగా ప్రజలకు, దేశానికి సేవ చేయాలనే ఉదాత్త ఆశయాలకు సెలవుచీటీ ఇచ్చిన బడా పరిశ్రమాధిపతులు జర్నలిజం ముసుగులో తమ ధనార్జనకు, పదవుల సంపాదనకు, ఇతర వ్యాపారాల లాభార్జనకు మీడియా సాధనాలను ఉపయోగించడం నేటి సంస్కృతిగా మారింది. మరోవైపు మీడియా యాజమాన్యాలు తమ విధేయతలనూ రాత్రికి రాత్రి మార్చుకొంటున్న పరిస్థితులూ నెలకొన్నాయి.

ప్రజల కోణంలోనే 'నవతెలంగాణ' ప్రయాణం

కోట్లు కుమ్మరిస్తేగానీ లభించని ఆధునిక టెక్నాలజీతో మూల మూలన ఉన్న పాఠకుడిని చేరుకోవాలనే వ్యూహంతో విస్తరిస్తున్న కార్పొరేట్ మీడియా సంస్థలు తమ ముద్రణా కేంద్రాలు, పత్రికలను మోసుకెళ్లే వాహనాలు, వాటి ఖర్చుకయ్యే భారీ పెట్టుబడులు ప్రజల గొంతుకను వినిపించాలనుకునే సంస్థల పాలిట యమపాశాలయ్యాయి. నూతన ఆర్థిక విధానాల్లో భాగంగా న్యూస్ ప్రింట్ ధరలపైనా పాలకులు టాక్స్‌లుపెంచారు. దీంతో పత్రికలు ముద్రించడానికి అవసరమైన కాగితం ధర ఎప్పుడు పెరుగుతుందో తెలియని స్థితి ఏర్పడింది. ఇంతటి ప్రతికూల పరిస్థితుల్లో ప్రజలిచ్చే ఆర్థిక వనరులతోనే 'అనుదినం.. జనం స్వరం' అన్న ధ్యేయంతో 'నవతెలంగాణ' పురోగమిస్తోంది. ఎలాంటి సెన్సేషనలిజానికీ స్పేస్ ఇవ్వకుండా వార్తలను యథాతథంగా ప్రజల దృష్టితో ప్రచురిస్తూ వార్తా విశ్లేషణలు, వ్యాఖ్యానాలు అందిస్తోంది. కేవలం ప్రజలు, శ్రేయోభిలాషుల మన్ననలు, వారి ఆర్థిక తోడ్పాటుతో 'నవతెలంగాణ' ప్రస్థానం సాగిస్తోంది. కరోనా సృష్టించిన ఆర్థిక సంక్షోభాన్ని తట్టుకునీ సంస్థ ఉద్యోగులు, సిబ్బంది త్యాగాలకోర్చి ప్రజల గొంతును కాపాడేందుకు ఒక యజ్ఞమే చేసి తనకంటూ ఓ ప్రస్థానాన్ని చాటుకుంటూ వస్తోంది.

పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట

- ఏడు నెలల్లో ఎంతో మార్పు తీసుకువచ్చాం
- విద్య, వైద్యానికి ప్రాధాన్యత
- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు



నవతెలంగాణ-మంచిర్యాల

కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు అన్నారు. నవతెలంగాణ 9వ వార్షికోత్సవం సందర్భంగా పత్రికా యజమాన్యానికి, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపి నవతెలంగాణతో మాట్లాడారు. మంచిర్యాల జిల్లాను గతంలో ఎన్నడూ లేని విధంగా రాబోయే నాలుగేండ్లలో అభివృద్ధికి మారు పేరుగా నిలుపుతామని అన్నారు. విద్యావైద్య రంగాలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరి అందే విధంగా కృషి చేస్తామని అన్నారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాల పాలనలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో, అన్ని రకాలుగా దివాళ తీసేలా చేసిందని అన్నారు. వారి స్వార్థం కోసం పరిపాలనను విచ్ఛిన్నం చేశారని అన్నారు. పేదవాడు కోరుకునే విధంగా పరిపాలన అందించడం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉండేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 1న వేతనాలు చెల్లిస్తున్నామని తెలిపారు. తమ ప్రభుత్వం వచ్చాక అనేక రంగాల్లో మార్పులు తీసుకొచ్చామని, సంక్షేమం, అభివృద్ధి పట్ల ప్రభుత్వం చిత్త శుద్ధితో పని చేస్తుందని తెలిపారు. ప్రజల కనీస అవసరాలు, మౌలిక సదుపాయాలు తీర్చాల్సిన అవసరం మాపై ఉందని, జిల్లా ప్రజలు నాపై, కాంగ్రెస్ ప్రభుత్వం పై పెట్టుకున్న నమ్మకాన్ని నెరవేర్చుటలో ప్రధాన పాత్ర పోషిస్తానని తెలిపారు. ఎన్నికల ముందు చెప్పినట్లుగానే హామీలన్నీ అమలు చేస్తామన్నారు. ధరణి ద్వారా ప్రజలు ఎన్నో ఇబ్బందులు, బాధలు, కష్టాలు ఎదుర్కొన్నారని, వాటన్నింటిని పరిష్కరించే బాధ్యతను ప్రభుత్వం చిత్త శుద్ధితో చేపట్టిందన్నారు. చెప్పిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామని తెలిపారు. ప్రజలకు కల్పించే సంక్షేమ పథకాల్లో విద్య, వైద్యం, వ్యవసాయం పట్ల ప్రభుత్వం ఎంతో నిబద్ధతతో ఉందని స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నేతృత్వంలో మంచిర్యాల జిల్లా రైతులకు రూ.1,16,67,963 రుణమాఫీ చేశామని, భారత దేశంలో ఏ రాష్ట్రం చేయనటువంటి పనిని తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపించిందని అన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాం..

గత ప్రభుత్వ పాలనలో మంచిర్యాల పట్టణ ప్రజలు తాగునీటి కొరకు ఎన్నో అవస్థలు పడేవారు. ఎండాకాలం వచ్చిందంటే గోదావరి ఎండిపోయి నీళ్ల లేక పట్టణంలోని కొన్ని ప్రాంతాల ప్రజలకు నీటి కష్టాలు తప్పేవి కాదు. అలాంటి సమయంలో మంచి నీటిని ట్రాక్టర్‌ల ద్వారా ప్రతి ఇంటికి అందించాం.

విద్యా వైద్యానికి పెద్దపీట

జిల్లాలో విద్యా వైద్యానికి పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. దండేపల్లిలో సుమారు 20ఎకరాల్లో బాయ్స్ కొరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ హాస్టళ్లను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. మంచిర్యాల పట్టణంలోని సాయికుంటలో భాలికల కొరకు ప్రత్యేక హాస్టళ్ల ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికీ జిల్లాలో మెడికల్ కళాశాల పనులు కొనసాగుతున్నాయని, మరో 650 పడకలతో కార్పొరేట్ హాస్పిటల్లకు దీటుగా మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తాలో ప్రభుత్వ హాస్పిటల్ ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. అందులో 350 ప్రభుత్వ జనరల్, మరో 300 పడకలు మాత శిశు కేంద్రానికి వినియోగించడం జరుగుతుందని తెలిపారు . మాత శిశు ఆరోగ్య కేంద్రంతో జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల గర్భిణీ స్త్రీలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని తెలియజేశారు.

జిల్లాకు తలమాణికంగా ఇండస్ట్రియల్ హబ్, ఐటీ పార్క్..

మంచిర్యాల జిల్లా వేంపల్లిలో సుమారు 292 ఎకరాల్లో ఇండస్ట్రియల్ హబ్, ఐటీ పార్క్ పరిశ్రమలు ఏర్పాటు చేయనున్నట్టు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు తెలిపారు. ఇప్పటికే భూ సేకరణ జరిగిందని జిల్లా కలెక్టర్, ఇతర సంబంధిత అధికారులు స్థల పరిశీలనలో ఉన్నట్లు పేర్కొన్నారు. దీనితో వ్యాపారాలు అభివృద్ధి జరుగి ఎంతో మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. అక్కడి ప్రాంతంలో విద్యుత్, నీటి వ్యవస్థ మెరుగుపడుతుందని తెలిపారు. వ్యాపార, పారిశ్రామిక, బొగ్గు వనరులతో పాటు రైల్వే రవాణా మార్గం ఉండటం సంతోషకరమన్నారు.

అభివృద్ధిపథం..సంక్షేమం ప్రధానం..!

- ప్రభుత్వాలు మారుతున్నా..ఆగని పథకాలు
- ఆరుగ్యారెంటీలతో ఒనగూరుతున్న ప్రయోజనం
- మూడు విడత రుణమాఫీతో అన్నదాతల్లో ఆనందం
- ఉమ్మడి జిల్లా సమగ్ర అభివృద్ధికి సర్కారు బాటలు

ప్రభుత్వాలు మారుతున్నా..అభివృద్ధి..సంక్షేమం మాత్రం ఆగడం లేదు. పథకాల పేర్లు మారుతున్నా..వాటి అమలు మాత్రం కొనసాగుతోంది. ఏ ప్రభుత్వం వచ్చినా ప్రజా సంక్షేమం..అభివృద్ధి ఏజెండాగా ముందుకు సాగుతున్నాయి. గత బీఆర్ఎస్ హయాంలో వివిధ రకాల సంక్షేమ పథకాలు అమలు కాగా.. పలు రకాల అభివృద్ధి పనులను చేపట్టింది. రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం సైతం నూతన పథకాలు అమలు చేయడం ద్వారా ప్రజల సంక్షేమమే ప్రధాన ఏజెండాగా ముందుకు సాగుతున్నట్లు కనిపిస్తోంది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీల్లో కొన్ని ఇప్పటికే అమలవుతుండగా.. మిగిలిన వాటిని అమలు చేసేందుకు సర్కారు సిద్ధమవుతోంది. తాజాగా మూడు విడతల్లో రైతు రుణమాఫీతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తం కాగా.. కాని వారు మాత్రం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పలు కొత్త పథకాల అమలుతో జనాల్లోనూ సంతోషం వ్యక్తమవుతోంది. నవతెలంగాణ వార్షికోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో సాగిన సమగ్ర అభివృద్ధిపై ప్రత్యేక కథనం..

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అనగానే మొదట గుర్తుకొచ్చేది అడవులే. దట్టమైన అరణ్యం..కొండకోనల నుంచి జాలువారుతున్న జలపాతాల అందమైన దృశ్యాలతో కనువిందు చేసిన జిల్లా..అభివృద్ధి పనుల్లోనూ ముందడుగు వేస్తోంది. వెనుకబడిన జిల్లాగా పేరుగాంచిన ఉమ్మడి ఆదిలాబాద్‌లోనూ పలు అభివృద్ధి..సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత ఏర్పడిన బీఆర్ఎస్ ప్రభుత్వం పలు అభివృద్ధి పనులను చేపట్టింది. కొత్త జిల్లాల ఏర్పాటుతో పాటు నూతన పంచాయతీలను ఏర్పాటుచేసింది. 500జనాభా కలిగిన తండాలు, గూడేలను పంచాయతీలుగా ఏర్పాటుచేయడంతో నూతన పాలకవర్గాలు ఏర్పడ్డాయి. వీటితో పాటు గ్రామాల్లో రైతువేదికలు, డంపింగ్‌యార్డులు, ఇంటింటి చెత్తసేకరణ కోసం ట్రాక్టర్లు, నూతన పంచాయతీ భవనాల నిర్మాణం తదితర వాటితో పల్లెల్లో మౌళిక వసతులు కల్పించింది.వీటితో పాటు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, కేసీఆర్‌కిట్టు, పింఛన్లు, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలతో ప్రజల సంక్షేమాన్ని కాంక్షించింది. సాగునీటి ప్రాజెక్టులైన ఎల్లంపల్లితో పాటు చనక-కోర్ట బ్యారేజీ నిర్మాణాన్ని చేపట్టింది. మరికొన్ని ప్రాజెక్టుల మరమ్మతులకు నిధులు కేటాయించింది. తదనంతరం రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ సర్కారు సైతం సంక్షేమమే ప్రధాన ఏజెండాగా ముందుకు సాగుతోంది.

ఆరు గ్యారెంటీలతో ఉత్సాహం..!

కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరగానే ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఇప్పటికే కొన్నింటిని అమలు చేస్తోంది. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం ద్వారా ఉమ్మడి జిల్లాలో రోజూ 1.50లక్షల మంది మహిళలకు ప్రయోజనం చేకూరుతోంది. గృహజ్యోతిలో భాగంగా 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును అమలు చేయగా 3.54లక్షల మంది జీరో బిల్లుతో ప్రయోజనం పొందుతున్నారు. రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందించడంతో ఉమ్మడి జిల్లాలో 3.48లక్షల మందికి లబ్ధి చేకూరుతోంది. తాజాగా మొదటి విడత రుణమాఫీతో ఉమ్మ జిల్లాలో 3.90లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరగా..రెండో విడతలోనూ 1.50లక్షల వరకు రుణాలు మాఫీ చేయడంతో అదే స్థాయిలో రైతులకు మేలు చేకూరుతోంది. మూడో విడతను ఈ నెల 15లోగా పూర్తిచేసేందుకు ప్రభుత్వాలు సన్నాహాలు చేస్తోంది. పంటబీమా కింద ప్రభుత్వమే ప్రీమియం చెల్లించేందుకు ముందుకు రావడంతో ఉమ్మడి జిల్లాలో 17.30లక్షల ఎకరాలకు వర్తించనుంది. ఇక నియోజకవర్గానికి 3500చొప్పున ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతామని ప్రభుత్వం హామీనివ్వడంతో ఉమ్మడి జిల్లాలో తొలి విడతలో 35వేల మందికి ప్రయోజనం కలగనుంది. వీటికి బడ్జెట్‌లో నిధులు సైతం కేటాయించింది. వీటితో పాటు మూడు విడతల్లో రుణమాఫీ చేయడంతో అనేక మంది రైతులకు ప్రయోజనం చేకూరింది. ఇక యువవికాసం, రూ.4వేల చొప్పున పింఛన్లు వంటి పథకాలు అమలు చేయాల్సి ఉంది. ఇక ఇటీవలే బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో పలు ప్రాజెక్టులకు నిధులు కేటాయించింది. వివిధ కార్పొరేషన్లకు నిధులు కేటాయించడం ద్వారా ఉపాధి నిమిత్తం బ్యాంకుల నుంచి రుణాలు పొందే అవకాశం లభిస్తుంది. వీటితో పాటు విద్యా, వైద్యం మెరుగుదలకు నిధులు కేటాయించడంతో మౌళిక వసతులు మెరుగుపడనున్నాయి. రాష్ట్రంలో తొలి దశలో ఆరు సాగునీటి ప్రాజెక్టులను అభివృద్ధి చేయనుండగా ఇందులో ఉమ్మడి జిల్లాకు చెందిన సదర్మాట్, నీల్వాయి, మత్తడివాగు, పిప్రి వంటి ప్రాజెక్టులు నాలుగు మనవే ఉండటం గమనార్హం. ఇక ప్రాణహిత, కుప్టి వంటి ప్రాజెక్టులు నిర్మించి ఉమ్మడి జిల్లాకు సాగునీటిని అందిస్తామని సీఎం భరోసా ఇవ్వడంతో వ్యవసాయం మరింత మెరుగుపడేందుకు ఆస్కారం ఏర్పడుతుంది.



నవతెలంగాణకు 9వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

పేద ప్రజల కోసం నిరంతర పోరాటం

నవతెలంగాణ-లక్షెట్టిపేట



పేద ప్రజల కోసం వారి సమస్యల గురించి నిరంతరం పోరాడేది నవతెలంగాణ పత్రిక అని మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాహిద్‌అలీ అన్నారు. అన్ని వర్గాల ప్రజల కోసం అధికారులు, ప్రజలు, ప్రజా ప్రతినిధులకు అనుక్షణం వారధిగా ఉంటూ సమస్యల నిజాయితీగా వెలుగులోకి తీసుకువస్తుందని అన్నారు. కార్మికుల పక్షాన నిలుస్తు వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందని కొనియాడారు. నవతెలంగాణ వార్షికోత్సవ సందర్భంగా పత్రిక యజమాన్యానికి, విలేకరులకు, పాటకులకు శుభాకాంక్షలు తెలిపారు.

నిష్పక్షపాతంగా వార్తలు రాస్తుంది

నవతెలంగాణ-లక్షెట్టిపేట



నిష్పక్షపాతంగా వార్తలు రాయడంలో నవతెలంగాణ కృషి బాగుందని లక్షెట్టిపేట సీఐ అల్లం నరేందర్ అన్నారు. కార్మికులు, బడుగు బలహీన వర్గాల సమస్యలను వెలికితీస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో నవతెలంగాణ కషి ఎంతో ఉందని కొనియాడారు. సమస్యల పరిష్కారమే ఎజెండాగా ముందుకు సాగుతున్న నవతెలంగాణ దినపత్రిక యాజవాన్యానికి, సిబ్బందకి, పత్రిక పాటకులకు వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

కార్మిక వర్గానికి అండగా నవతెలంగాణ

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి

నవతెలంగాణ-మంచిర్యాల



నిత్యం సమాజంలో జరిగే అన్యాయాలు, అక్రమాలను వెలికి తీస్తూ కార్మిక వర్గానికి అండగా ఉండేది నవతెలంగాణ పత్రిక అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకే రవి అన్నారు. నవతెలంగాణ 9వ వార్షికోత్సవం సందర్భంగా యాజమాన్యానికి, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్మిక, బడుగు, బలహీన వర్గాల తరపున నిలిచి, ప్రజల సమస్యలు తమా ఎజెండాగా పెట్టుకొని ప్రజల సమస్యలపై కథనాలు రాస్తూ, ప్రజల్లో నిలిచింది నవతెలంగాణ అని కొనియాడారు.

కార్మిక, కష్టజీవుల పక్షం నవతెలంగాణ

- ఉద్యోగ సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ ఆర్.రాజేశం

నవతెలంగాణ-మంచిర్యాల



పత్రికలనేవి పెట్టుబడిదారీ వర్గాల పుత్రికలుగా నిలుస్తున్న వేళ, కార్మిక కష్టజీవుల పక్షం వహిస్తున్న పత్రిక నవతెలంగాణ. వార్తలు, ఫీచర్లతో పాటు అక్షరమక్షరమూ ప్రజాపక్షం వహిస్తున్నది నవతెలంగాణ. ప్రజాస్వామ్యం నిలబడాలంటే పత్రికలు నిరంతరం ప్రతిపక్ష పాత్ర నిర్వహించాలి. సమస్యలపై పాలకులను నిలదీస్తూ ప్రజల తరపున నిలబడాలి. అలాంటి ప్రజాపత్రికగా నిలబడుతున్న నవతెలంగాణకు 9వ వార్షికోత్సవం సందర్భంగా అభినందనలు. ఇలాంటి పత్రికలకు అన్ని వర్గాల ప్రజలు సైతం అండగా నిలబడాలి.

ప్రజల పక్షాన నిలుస్తోంది

నవతెలంగాణ-కాసిపేట



నవతెలంగాణ దినపత్రిక నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తోందని కాసిపేట ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. కార్మికులు, బడుగు బలహీన వర్గాల సమస్యలను వెలికితీస్తూ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో నవతెలంగాణ కషి ఎనలేనిదని అన్నారు. నిష్పాక్షపాతంగా వార్తలు రాయడంలో నవతెలంగాణ కృషి అభినందనీయమని కొనియాడారు. నవతెలంగాణ దినపత్రిక వార్షికోత్సవం సందర్భంగా పత్రిక కార్యాలయ సిబ్బందికి, విలేకరులకు, పత్రిక పాటకులకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా సమస్యలపై నిర్భయంగా వార్తలు రాస్తుంది..

నవతెలంగాణ-లక్షెట్టిపేట



ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలపై నిర్భయంగా నవతెలంగాణ దినపత్రిక వార్తలు రాస్తుందని మున్సిపల్ వైస్ చైర్మన్ పొందేటి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. నవతెలంగాణ 9వ వార్షికోత్సవం సందర్భంగా పత్రిక యాజమాన్యానికి, పాటకులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటుందని కొనియాడారు. వాస్తవ సమాచారం అందించడం నిజాయితీని ప్రదర్శిస్తుందని అన్నారు.

నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తోంది

నవతెలంగాణ-జన్నారం



నవతెలంగాణ దినపత్రిక నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తోందని జన్నారం ఎస్ఐ రాజవర్ధన్ అన్నారు. కార్మికులు, బడుగు బలహీన వర్గాల సమస్యలను వెలికితీస్తూ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో నవతెలంగాణ కషి ఎనలేనిదని అన్నారు. నిష్పాక్షపాతంగా వార్తలు రాయడంలో నవతెలంగాణ కృషి అభినందనీయమని కొనియాడారు. నవతెలంగాణ దినపత్రిక వార్షికోత్సవం సందర్భంగా పత్రిక కార్యాలయ సిబ్బందికి, విలేకరులకు, పత్రిక పాటకులకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజల పత్రిక నవతెలంగాణ

- మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్

నవతెలంగాణ-మంచిర్యాల



నవతెలంగాణ యాజమాన్యానికి, సిబ్బందికి 9వ వార్షికోత్సవ శుభాకాంక్షలు. ప్రజాశక్తి నుంచి నేను ఈ పేపర్ పాఠకున్ని, నవ తెలంగాణగా పేరు మర్చి ప్రజల్లో నిలిచిపోయారు. నిత్యం ప్రజల పక్షాన వార్తలు రాస్తూ, ప్రజల తరపున నిలుస్తుంది. కార్పొరేట్ శక్తులకు తలొగ్గక ప్రజలతో మమేకమైన నవతెలంగాణ పత్రిక రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నాను. మంచిర్యాల జిల్లా పోలీస్‌శాఖ తరుపున మరో సారి నవతెలంగాణ పత్రికకు 9వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.

నిర్భయంగా వార్తలు రాస్తుంది

నవతెలంగాణ-కాసిపేట



నిష్పక్షపాతంగా వార్తలు రాయడంలో నవతెలంగాణ కృషి బాగుందని కాసిపేట తహసీల్దార్ భోజన్న అన్నారు. కార్మికులు, బడుగు బలహీన వర్గాల సమస్యలను వెలికితీస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో నవతెలంగాణ కషి ఎంతో ఉందని కొనియాడారు. సమస్యల పరిష్కారమే ఎజెండాగా ముందుకు సాగుతున్న నవతెలంగాణ దినపత్రిక యాజవాన్యానికి, సిబ్బందకి, పత్రిక పాటకులకు వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా పోరాటాలకు మద్దతుగా నిలుస్తోంది

నవతెలంగాణ-కాసిపేట



ప్రజల సమస్యల పరిష్కారవే పరమావదిగా పని చేస్తు నిడంబరంగా దీర్ఘకాలం కొనసాగుతున్న దిన పత్రిక నవతెలంగాణ అని ఎంపీఓ సఫ్దర్‌అలీ అన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలు పరిష్కారంలో కీలకపాత్ర పోషిస్తోందని కొనియాడారు. ప్రజలను చైతన్యవంతులను చేస్తూ ప్రత్యేక కథనాలు శీర్షికలు ప్రచురిస్తూ కార్మికవర్గానికి బాసటగా నిలుస్తోందని అన్నారు. నవతెలంగాణ పత్రిక తొమ్మిదో వార్షికోత్సవం సందర్భంగా యాజమాన్యానికి, పాటకులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

రైతుల పక్షాన నిలుస్తోంది..

నవతెలంగాణ-లక్షెట్టిపేట



రైతుల పక్షాన నిరంతరం వార్త కథనాలు ప్రచూరిస్తూ సమస్యల పరిష్కారానికి నవతెలంగాణ కృషి చేస్తోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పింగిలి రమేష్ అన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి అండగా నిలుస్తున్న పత్రిక అని కొనియాడారు. నిరంతరం పేద పక్షాన ఉంటూ వారి సమస్యలకు పరిష్కారానికి కృషి చేస్తున్న నవతెలంగాణ దినపత్రిక యాజమాన్యానికి, పాటకులకు 9వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

నవతెలంగాణ-వేమనపల్లి



ప్రజల సమస్యల పరిష్కారమే పరమావదిగా పని చేస్తు నిడంబరంగా దీర్ఘకాలం కొనసాగుతున్న దిన పత్రిక నవతెలంగాణ అని వైద్యాదికారి డాక్టర్ రాజేష్ అన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలు పరిష్కారంలో కీలకపాత్ర పోషిస్తోందని కొనియాడారు. ప్రజలను చైతన్యవంతులను చేస్తూ ప్రత్యేక కథనాలు శీర్షికలు ప్రచురిస్తూ కార్మికవర్గానికి బాసటగా నిలుస్తోందని అన్నారు. నవతెలంగాణ పత్రిక తొమ్మిదో వార్షికోత్సవం సందర్భంగా యాజమాన్యానికి, పాటకులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధి

నవతెలంగాణ-జన్నారం



ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నవతెలంగాణ పత్రిక పనిచేస్తోందని ఎంఈఓ ఎం విజయ్‌కుమార్ అన్నారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెలికి తీసి అధికారులకు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేయడంలో తనదైన పాత్ర పోషిస్తోందని కొనియాడారు. నవతెలంగాణ దినపత్రికలో ప్రతిరోజు మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో సైతం నెలకొన్న సమస్యలను సేకరించి ప్రచురించడమే కాకుండా సమస్యల పరిష్కారం అయ్యేంతవరకు దానిపై దృష్టిని సారిస్తుందని అన్నారు. 9వ వార్షికోత్సవం సందర్భంగా నవ తెలంగాణ కుటుంబ సభ్యులు వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

మహిళల చైతన్యానికి ఎనలేని కృషి

నవతెలంగాణ-జన్నారం



మహిళలకు స్ఫూర్తినిచ్చే విధంగా నవతెలంగాణలో మానవి కాలాన్ని కేటాయించి అందులో మహిళలు సాధించిన విజయగాదలను ప్రచూరిస్తు మహిళల్లో స్ఫూర్తిని నింపుతోందని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోతు విజయ శంకర్ అన్నారు. వీటితోపాటు వివిధ వార్తలను ప్రచురిస్తూ పేదల కోసం నవతెలంగాణ పనిచేస్తుందని అన్నారు. నిబద్ధతతో కొనసాగుతున్న నవతెలంగాణ పత్రిక ఎల్లకాలం ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నామన్నారు. ఇందులో పనిచేస్తున్న సిబ్బందికి, విలేకరులకు తొమ్మిదవ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

పత్రికలు సమాజానికి మార్గదర్శి వంటివి

చాపిడి శ్రీనివాస్, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు

నవతెలంగాణ-వేమనపల్లి



రాగ, ద్వేషరహితంగా, జనహితాన్ని మాత్రమే దృష్టిలో పెట్టుకుని సామాజిక ప్రయోజనం కోసం పాటుపడే పత్రికలకు ప్రజాదరణ ఎల్లప్పుడూ ఉంటుంది. ఆ కోవకు చెందిన పత్రికల్లో నవతెలంగాణ ముందుంటుంది. జనహితమే అబిమతంగా సాగుతున్న నవతెలంగాణ తొమ్మిదో వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా మరింత దినదినాభివృద్ధి చెందాలని ఆశిస్తున్నాను.

పక్క రాష్ట్రాలకు విస్తరిస్తున్న సింగరేణి

- ఒడిశాలో నైనీ బ్లాకు ద్వారా బొగ్గు ఉత్పత్తికి రంగం సిద్ధం
- 1600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి



నవతెలంగాణ-జైపూర్

తెలంగాణకు మాత్రమే పరిమితం కాకుండా ఇతర రాష్ట్రాలకు సింగరేణి విస్తరిస్తోంది. ఒడిశాలో అడుగిడిన సింగరేణి నైనీ బ్లాకు ద్వారా బొగ్గు ఉత్పత్తికి రంగం సిద్ధం చేస్తోంది. రానున్న ఐదు సంవత్సరాల్లో 100 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా అవసరమైన ఆదునికతను ఆచరణలో పెట్టబోతుంది. ఆదునిక మైనింగ్ టెక్నాలజీ, శాస్త్ర సాంకేతిక విషయాల్లో ఆస్ట్రేలియా దేశ ట్రేడ్ ఇన్వెస్ట్‌మెంట్ కమీషనర్‌తో సింగరేణి సీఎండీ ఇదివరకే సమావేశమయ్యారు. అదేవిధంగా వ్యాపార విస్తరణలో భాగంగా ఇతర రంగాల్లో గల అవకాశాలను పూర్తిగా పరిశీస్తుంది. గతంలో ఆస్ట్రేలియా దేశానికి చెందిన సింటార్స్ తదితర సంస్థలతో మైనింగ్ రక్షణ, సాంకేతిక విషయాల్లో సేవలు సంస్థ అవసరాల మేరకు వినియోగించుకుంది. నైనీ బ్లాక్ ద్వార ఉత్పత్తి చేయనున్న బొగ్గును సింగరేణి థర్మల్ విద్యుత్ అవసరాలకు వినియోగించుకోవాలని భావిస్తోంది.

1600 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాట్లు

నైనీ గనికి 50 కిలో మీటర్ల దూరంలో 1600 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని సింగరేణి యాజమాన్యం భావిస్తోంది. ఈ క్రమంలో సింగరేణి అధికారుల బృందం గతంలో ఒడిశా పర్యాటనలో భాగంగా వివిధ ప్రదేశాలలో సుమారుగా 800 ఎకరాల స్థలాన్ని గుర్తించింది. అదేవిధంగా ఒడిశా అటవీ భూముల బదలాయింపుకు సంబంధించి అక్కడి అటవీ శాఖ ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరిపి అవసరమైన మేరకు సహాయ సహకారం అందించాలని కోరింది. సింగరేణి యాజమాన్యం విజ్ఞప్తులకు సానుకూలంగా సందిస్తున్న ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో బొగ్గు ఉత్పత్తికి అవసరమైన చర్యలు చేపట్టింది.




వ్యాపార విస్తరణకు అడుగులు..

వ్యాపార విస్తరణతో పాటు భవిష్యత్తు లక్ష్యాలతో ముందుకు సాగుతున్న యాజమాన్యం ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేషించుకున్న 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించడం కోసం అవసరమైన చర్యలు చేపట్టింది. బొగ్గు ఉత్పిత్తికి ప్రతికూల పరిస్థితులు ఎదురు కాకుండా ముందస్తు జాగ్రత్తలతో రోజు వారి ఉత్పత్తి లక్ష్యాలతో నిర్దేషిత వార్షిక ఉత్పత్తి సాధించాలని ఎప్పటకప్పుడు సింగరేణి సీఎండీ ఏరియా జనరల్ మేనేజర్లకు దిశా నిర్దేషం చేస్తున్నారు. ఈ క్రమంలో సింగరేణి డైరెక్టర్లు ప్రాంతాల వారిగా పర్యటిస్తూ ఉత్పత్తి లక్ష్యాలను పరిశీలిస్తున్నారు. ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించడానికి అవసరమైన యంత్రాలను, ఓవర్ బర్డెన్ తొలగింపు ఏజెన్సీల నియామకం తదితర విషయాలపై ఏరియాల వారిగా యాజమాన్యాలకు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తోంది.

100 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యం

రానున్న ఐదు సంవత్సరాల్లో 100 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్న యాజమాన్యం అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటుంది. ఈ క్రమంలో ఐదు సంవత్సరాల్లో 10 గనులు ప్రారంభించుకోవల్సిన అవసరాన్ని గుర్తించి దీని కోసం సన్నాహాకాలు ముమ్మరం చేస్తోంది. 1998 సంవత్సరానికి ముందు వరుసగా 20 సంవత్సరాలు నష్టాలను చవి చూసిన సింగరేణి ఇప్పుడు లభాల బాటలో పయనిస్తోంది. మూసివేత వైపు అడుగులు వేసిన సంధర్భంలో సింగరేణి కార్మికులు, అధికారులు సమిష్టి ఫలితంగా వరుస నష్టాల నుండి బయటపడి గడిచిన 25 సంవత్సరాలుగా లాభాలను అర్జిస్తోంది. ధీర్ఘకాలిక భవిష్యత్ దృష్టితో ముందుకు సాగుతున్న యాజమాన్యం బొగ్గు మార్కెట్‌లో పోటీని తట్టుకుంటూ ఎటువంటి సవాళ్లనైనా




శక్తి సామార్థ్యాలను పెంచుకుంటుంది. కోలిండియాతో పాటు ప్రైవేటు ఉత్పత్తిదారులతో కూడా పోటీని ఎదుర్కొంటున్న సింగరేణి ఉత్పత్తి ఖర్చులను తగ్గించుకుంటూ ఉత్పత్తిని పెంచుకుంటుంది. ఈ విధంగా బొగ్గు ఉత్పత్తి మరో వైపు థర్మల్ విద్యుత్, సోలార్ విద్యుత్, పవన విద్యుత్ ఉత్పత్తి వైపు దృష్టి సారించింది. సింగరేణి భవిష్యత్తు భద్రత కోసం వ్యాపార విస్తరణలో భాగంగా ఏటకేటా ఉత్పత్తి లక్ష్యాలను అధిగమిస్తూ ఆర్థిక వృద్ధి రేటును పెంచుకుంటూ లాభాల బాటలో పయనిస్తోంది.

పల్లె సీమల మధ్య పారిశ్రామికాభివృద్ధి

- విడిపోయిన మండలంలో విద్యుత్ ప్లాంట్
- ఇందారం-1ఏ భూగర్భ, ఉపరితల గని
- అదనంగా మరో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌కు యత్నం
- అంతరాష్ట్ర, జాతీయ రహదారులతో ఎల్ మడుగు ప్రకృతి అందాలు
- తగ్గిన రక్షిత అటవీ ప్రాంతం, వ్యవసాయ విస్తీర్ణం అత్యధికం





శివ్వారం మొసళ్ల అభయారణ్యం (ఎల్ మడుగు)

నవతెలంగాణ-జైపూర్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి విడిపోయి నూతనంగా ఏర్పడిన తెలంగాణలో పరిపాలన సౌలభ్యం, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా చేపట్టిన జిల్లాలు, మండలాల విభజనతో జైపూర్ మండలం పల్లె సీమల మధ్య పారిశ్రామిక ప్రాంతంగా అవతరించింది. ఉమ్మడి జైపూర్ మండలాన్ని విభజిస్తూ 11 రెవెన్యూ గ్రామాలతో భీమారం మండలంగా విడదీయడంతో మిగిలిన 17 గ్రామ పంచాయతీలు 4 అనుబంధ గ్రామాలతో కూడిన జైపూర్ మండలం ఆవిర్భవించింది. 24,813 కిలో మీటర్ల విస్తీర్ణంలో మండల ముఖ:చిత్రం అవిష్కృతమై రామారావుపేట్ నుండి మొదలు శివ్వారం వరకు గల గోదావరి నది పోడవు విస్తరించింది. వ్యవసాయాన్ని నమ్ముకున్న కుటుంబాలే అత్యధికంగా విభజన అనంతరం మిగిలివున్న జైపూర్ మండలంలో సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్, ఇందారం-1ఏ భూగర్భగనితో పాటు ఇందారం ఉపరితల గనులతో పారిశ్రామికంగా అడుగులు వేస్తోంది. బొగ్గు ఉత్పత్తితో పాటు విద్యుత్ ఉత్పత్తి వైపు దృష్టి సారించిన సింగరేణి యాజాన్యం మండల పరిధి పెగడపల్లి శివారుల్లో 1200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంటును నెలకొల్పింది. మరో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంటును అదనంగా ఏర్పాటు చేయడం కోసం ఏర్పాట్లు చేస్తోంది. ఇందారం-1ఏ భూగర్భ గనితో పాటు ఇందారం ఉపరితల గని (ఓపన్‌కాస్ట్ గని) ద్వార భూగర్భ బొగ్గు నిక్షేపాలను వెలికి తిస్తోంది. హైదరాబాద్ నుండి ఇందారం ఎక్స్ రోడ్డు (ఎన్‌హెచ్-63) వరకు అంతర్‌రాష్ట్ర రహదారి-ఎస్‌హచ్-1 (రాజీవ్ రహదారి) నిజామాబాద్ నుండి జగ్ధల్‌పూర్(ఛత్తీష్‌ఘడ్) జాతీయ రహదారి -63, వెలుగులు విరజిమ్ముతున్న విద్యుత్ ప్లాంట్ మండలానికి సొంతం. 2011 జనాభ లెక్కల ప్రకారం 13,342 కుటుంబాలు, 50,079 జనాభలో 25,183 స్త్రీలు, 24,896 పురుషులు, కులాల వారిగా చూస్తే షెడ్యూల్ కులాలకు చెందిన వారు 17,820 ఇందులో పురుషులు 9,079, స్త్రీలు 8,741 మంది. షెడ్యూల్డ్ తెగలకు చెందిన వారు మొత్తంగా 4,187 ఇందులో పురుషులు 2,123 స్త్రీలు 2,064 ఇతర కులాలకు చెందిన వారి జనాభా 28,072 ఇందులో పురుషులు 13,981 స్త్రీలు 14,091 మంది. ఇతర కులాల వారితో పోల్చి చూస్తే ఎస్సీ, ఎస్టీ కులాల వారి జనాభ తక్కువగా ఉంటుంది. 14 కిలో మీటర్ల జాతీయ రహదారి పొడవు విస్తరించి ఉన్న మండలంలో శివ్వారం శివారు ఎల్ మడుగు ప్రకృతి అందాలతో ప్రత్యేకతను సంతరించుకుంది. రక్షిత అటవీ ప్రాంతం అతితక్కువగా ఉన్నప్పటికీ వ్యవసాయ భూములు అత్యధికంగా మండల పరిధిలో 9,040 చదరపు కిలో మీటర్ల పరిధిలో రక్షిత అటవీ ప్రాంతం విస్తరించివుంది. 12,783 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో పంటలను సాగు చేస్తున్నారు. కానుకూరు, జడగాయవాగు, ఊట్లవాగు ప్రాజెక్టులతో పాటు చెరువులు, కుంటలు, వ్యవసాయ బోర్ల ద్వార మండల ప్రజలు వివిధ రకాలైన పంటలను సాగు చేస్తున్నారు. ఆహార ధాన్యపు పంటలతో పాటు వాణిజ్య పంటల సాగు వైపు రైతులు దృష్టి సారిస్తున్నారు.

మంచిర్యాల చేపకు డిమాండ్..!



నవతెలంగాణ-హాజీపూర్

మంచిర్యాల జిల్లాలో మత్స్య సంపదకు కొదవ లేదు. జిల్లాలో 9పెద్ద రిజర్వాయర్లు కలుపునికి మొత్తం 372 చెరువులు, కుంటలు ఉన్నాయి. పెద్ద రిజర్వాయర్లు అయిన ఎల్లంపల్లి, అన్నారం, సుందిళ్ల, రాళ్లవాగు, గొల్లవాగు, నీల్వాయి, పెద్దపేట్, నల్లవాగు, కుమ్మరివాగుల్లో లభించే చేపలు దేశ రాజధాని ఢిల్లీతో పాటు కలకత్తా, ముంబై, పూణే, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రధాన నగరాలకు ఎగుమతి అవుతున్నాయి. ప్రధానంగా రవ్వ, బొచ్చ, బొమ్మె ఆలుగు, బద్రి, చందమామ, కాకిచిత్ర, బంగారు తీగ, మెరిగా, పాపర, ఇంగిలీకం, ఐరపాము, పంప్లేట్, టైగర్ ఫ్రాన్స్, గంగ రొయ్య చెప్పు తట్ట, ఎండ్రికాయలు (పీతలు) లాంటి రకాలు లభ్యం అవుతున్నాయి. ఇందులో ప్రధానంగా బొచ్చు, రవ్వ లాంటి చేపలు 25కిలోల వరకు పెరుగుతాయి. వీటికి బయట మార్కెట్‌లో భారీ డిమాండ్ ఉంది. ఇక్కడ కిలో రూ.120 నుంచి, రూ.150 వరకు కొనుగోలు చేస్తున్న దళారులు ఇతర ప్రాంతాల్లో కిలో రూ.400 వరకు అమ్మతున్నారు. ఏడాదికి 11,151 మెట్రిక్ టన్నుల చేపల లభ్యత ఉంటుంది.

10వేల మందికి ఉపాధి..

జిల్లాలో 128 మత్స్య సహకార సంఘాలు ఉన్నాయి. ఇందులో 7,800 మంది మత్స్యకారులు నమోదు చేసుకున్నారు. నమోదు కానీ మత్స్య కారులు కలుపుకొని 10 వేల మంది వరకు చేపల వేట ఆధారంగా జీవిస్తున్నారు. వీరి కోసం ప్రభుత్వం ఏటా 2.15 కోట్ల చేప పిల్లలను రిజర్వాయర్లు, చెరవుల్లో వేస్తుంది. వేట చేసిన చేపలు ధర లభిస్తే అమ్ముకుంటారు. లేని పక్షంలో ఆర బెట్టి వరుగుల రూపంలో అమ్ముతుంటారు. దీనికి కుటుంబ సభ్యుల అవసరం కూడా ఉంటుంది. రోజు వలలు తీసుకురావడం అల్లడం తీసుకెళ్లి నీటిలో కట్టడం ఉదయం వెళ్లి ఏరడం లాంటివి చేస్తుంటారు. జిల్లా స్థాయిలో వివిధ ప్రాంతాల్లో చేపల మార్కెట్లు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర ప్రకటించాలని మత్స్య కార్మికులు కోరుతున్నారు.

జిల్లాకే తలమానికం...

ఇప్పటికే మత్స్యకారుల పక్షాన ఎల్లంపల్లి కల్పవల్లిగా మారింది. జిల్లాలో ప్రధాన మత్స్య వనరుగా ఎల్లంపల్లి ప్రాజెక్టు ఉంది. ఎల్లంపల్లి, గుడిపేట వద్ద నిర్మితమై ఉండగా ధర్మపురి వరకు గోదావరి పరివాహకంగా 15 గ్రామాల మత్స్య కారులు చేపల వేటపై ఆధారపడి బతుకుతున్నారు. ఈ ప్రాజెక్ట్ దిగువ భాగాన 98 ఎకరాల్లో చేపల పెంపకం పునరుత్పత్తి కేంద్రం ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే స్థల సేకరణ పూర్తయింది. స్థానిక ఎమ్మెల్యే ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఈ ప్రాజెక్ట్ రూపకల్పన చేస్తున్నారు. రూ.100కోట్ల వ్యయంతో దీని నిర్మాణం జరగనుంది. కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర సర్కారు 40 శాతం నిధులు వెచ్చించనున్నాయి. ఇది పూర్తయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 300 వందల మందికి ఉపాధి లభించనుంది. దీంతో పాటు ఇక నుంచి చేప పిల్లలను వేరే ప్రాంతాల నుంచి తీసుకొచ్చే అవసరం లేదు. ఇక్కడి ఉత్పత్తి అయిన పిల్లలను జిల్లాలోని అన్ని చెరవులకు సరఫరా చేయడమే కాకుండా పొరుగు జిల్లాలకు కూడా సరఫరా చేసే అవకాశం ఉంది. ఇది ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద పర్యాటక ప్రాంత అభివృద్ధిలోనూ దోహదం కానుంది.

బదిలీ వర్కర్లకు జనరల్ మజ్దూర్‌గా క్రమబద్ధీకరణ

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి వ్యాప్తంగా పని చేస్తున్న 2364 మంది బదిలీ వర్కర్లకు జనరల్ మజ్దూర్‌గా ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తున్నట్లు సింగరేణి సీఎండీ ప్రకటిచారు. ఉద్యోగులుగా చేరి భూగర్భ గనుల్లో 190 రోజులు, ఉపరితల గనులు, విభాగాల్లో 240 రోజులు విధులు నిర్వర్తించిన వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించారు. ఈ క్రమంలో 2364 మంది బదిలీ వర్కర్లకు జనరల్ మజ్దూర్‌గా క్రమబద్ధీకరించగా ఇందులో 243 మంది మహిళలకు అవకాశం లభించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేయాలని డైరెక్టర్ పర్సనల్‌కు ఆదేశాలు జారీ చేసిన సీఎండీ సెప్టెంబర్ 1 నుండి వీరు జనరల్ మజ్దూర్‌గా పరిగణించబడుతారని పేర్కొన్నారు. బదిలీ వర్కర్ల నుండి జనరల్ మజ్దూర్‌గా గుర్తించబడుతున్న వారు క్రమశిక్షణతో పని చేయాలని సూచించారు. సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పని చేయాలని తెలిపారు.

విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపాలి : డీఈఓ ప్రణీత

నవతెలంగాణ-తాంసి

వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాధికారి ప్రణీత ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం పొన్నారి జడ్పీ ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదవ తరగతి విద్యార్థులను ఉపాధ్యాయురాలిగా పలు ప్రశ్నలు అడిగి సామర్థ్యాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఆమె వెంట ప్రధానోపాధ్యాయులు రాజాశంకర్‌తో పాటు ఉపాధ్యాయులు ఉన్నారు.

ఓరియంట్‌లో తక్షణమే ఎన్నికలు నిర్వహించాలి



నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీలో కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించడంతో ఆదిలాబాద్ డీసీఎల్ మెతకవైఖరి అవలంభిస్తున్నారని, కాలయాపన చేయకుండా వెంటనే ఎన్నికలను నిర్వహించాలని లోకల్ ఓరియంట్ సిమెంట్ ఎంప్లాయిమెంట్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం దేవాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 24న అన్ని యూనియన్ నాయకులతో డీసీఎల్ సమావేశాన్ని నిర్వహించి ఆగస్టు 30న ఓటర్ లిస్ట్ అందిస్తామని లెటర్ ద్వారా సమాచారం అందించారని, కాని మళ్లీ సమావేశం వాయిదా వేస్తున్నట్లు సమాచారాం ఇచ్చారన్నారు. ఓరియంట్ ఎన్నికల నిర్వహణ పట్ల డీసీఎల్ మెతకవైఖరి అవలంభిస్తున్నారన్నారు. ఇప్పటికే సమావేశాలు తప్ప ఎన్నికల తంతు ముందుకు సాగడం లేదని యూనియన్ నాయకులు అసహనం వ్యక్తం చేశారు. ఎన్నికలై 5సంవత్సరాలు గడుస్తున్నాయని, ఇప్పటికైనా కాలయాపన చేయకుండా ఎన్నికలు నిర్వహించాలి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లోకల్ ఓరియంట్ సిమెంట్ ఎంప్లాయిమెంట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఆడె జంగు, ప్రధాన కార్యదర్శి సోయం సూరు, ధర్మారావు, శ్రావణ్‌కుమార్, అత్రం జంగు, భీమయ్య, జగన్, తిరుపతి, నాగరాజు, విజయ్ పాల్గొన్నారు.

ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చాలి



నవతెలంగాణ-తాండూర్

కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎంసీపీఐ(యు) జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం బెల్లంపల్లి తహసీల్దార్ జోత్స్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి 9నెలలు కావస్తున్నా హామీలు మాత్రం నెరవేర్చడం లేదని ఆరోపించారు. ఓడ ఎక్కేదాకా ఓడ మల్లన్న ఓడ దిగాక బోడి మల్లన్న అనే చందంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఎద్దేవా చేశారు. వృద్ధులకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6వేల పెన్షన్ అమలు పరచాలన్నారు. రూ.500కే గ్యాస్ అన్న ప్రభుత్వం ఇప్పటికీ వరకు అమలు చేయకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం స్పందించి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. లేని పక్షంలో పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసుపులేటి వెంకటేష్, బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆరేపల్లి రమేష్, ఆరెపల్లి సతీష్ పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



కాగజ్‌నగర్ : పట్టణంలోని త్రిశూల్‌పహాడ్‌పై ఉన్న కమ్యూనిటీ హాలులో శుక్రవారం కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు పంపిణీ చేశారు. కాగజ్‌నగర్‌తో పాటు దహెగాం, కౌటాల మండలాలకు చెందిన 128 మంది లబ్దిదారులకు వీటిని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ ఫైళ్లు తన వద్ద పెండింగ్‌లో ఉండే ప్రసక్తే లేదని అన్నారు. గతంలో ఉన్న ఎమ్మెల్యేలు ఫైళ్లను పరిశీలించి, లబ్దిదారులు ఏ పార్టీకి చెందిన వారని చూసి మరీ సంతకాలు చేసేవారని తెలిపారు. దీంతో అర్హులకు లబ్ది చేకూరలేదని అన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ తాను పని చేస్తానని స్పష్టం చేశారు. మారుమూల ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిధులను తీసుకువస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, మున్సిపల్ ఛైర్మన్ షాహిన్‌సుల్తానాతో పాటు పలువురు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన డీఈఓ



కాగజ్‌నగర్ : మండలంలోని బోడపల్లి ప్రాథమికోన్నత పాఠశాల, పట్టణంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి పార్సి అశోక్ అకస్మికంగా తనిఖీ చేశారు. బోడపల్లి పాఠశాలలో కేవలం ఇద్దరు మాత్రమే ఉపాధ్యాయులు ఉండగా, గతంలోనే భట్టుపెల్లి, ఆరెగూడ కాంప్లెక్స్ నుండి ఇద్దరు ఉపాధ్యాయులను ఇక్కడ వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో భాగంగా నియమిస్తూ డీఈఓ ఆదేశాలు జారీ చేశారు. కాని ఈయన తనిఖీలో ఆ ఇద్దరు ఉపాధ్యాయులు లేకపోవడంతో ఆయా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే ఆ ఇద్దరు ఉపాధ్యాయులను బోడపల్లి పాఠశాలకు పంపించాలని ఆదేశించారు. కాగజ్‌నగర్‌లోని జెడ్పీఎస్ఎస్ బాలుర పాఠశాలను సందర్శించి తరగతి గదులలో ఉపాధ్యాయుల బోధనను పరిశీలించారు.

కుప్టి ప్రాజెక్టు మా కొద్దు..!

- ఏకగ్రీవ తీర్మానం చేసిన గ్రామస్తులు
- పచ్చని పంట పొలాలు కోల్పోతామని ఆవేదన
- సమాచారం లేకుండా సర్వే చేపట్టడంపై ఆగ్రహం
- భూములు ఇచ్చేదిలేదని స్పష్టం చేస్తున్న రైతులు

కుప్టి ప్రాజెక్టు నిర్మాణంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ఈ ప్రాజెక్టు మాకొద్దని స్థానిక రైతులు ఖరాఖండిగా చెబుతున్నారు. ప్రాజెక్టు నిర్మాణంతో తమ జీవనాధారమైన పచ్చని పంట పొలాలు కోల్పోవాల్సి వస్తుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుతో తమకెలాంటి ఉపయోగం లేదని.. బతుకులో జీవనాధారమైన రూ.కోట్ల విలువైన భూములను ప్రాజెక్టుకు ఇచ్చేది లేదని స్పష్టం చేస్తున్నారు. ఏడాదికి రెండు పంటలు పండిస్తున్న తమ నుంచి భూములు ఇచ్చే ప్రసక్తే లేదని గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మాణం చేసి రెవెన్యూ అధికారులకు పంపించడం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోపక్క కొత్త ప్రభుత్వం సైతం కుప్టి ప్రాజెక్టు నిర్మాణంపై ముందడుగు వేయడంతో రెవెన్యూ, నీటి పారుదలశాఖ అధికారులు సర్వే కోసం ఆ ప్రాంతానికి వెళ్లారు. దీంతో రైతులు అధికారుల తీరును తీవ్రంగా నిరసిస్తున్నారు. ప్రాజెక్టు నిర్మిత ప్రాంతమైన కుప్టితో పాటు ముంపునకు గురయ్యే కుమారి, గాజిలి, గాంధారి గ్రామాలు సైతం వ్యతిరేకిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.



కుప్టి వాగు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, నేరడిగొండ

నేరడిగొండ మండలం కుప్టి వద్ద కడెం వాగుపై సాగునీటి ప్రాజెక్టు నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. 2015లోనే ఈ ప్రాజెక్టు నిర్మాణానికి గత ప్రభుత్వం నిర్ణయించినా నిధులు విడుదల చేయకపోవడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. అనంతరం రెండోసారి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ సర్కారు రూ.900కోట్లు మంజూరుచేస్తూ నిర్ణయం తీసుకుంది. నిధులు విడుదలలో జాప్యం కావడంతో అంచనాలు సవరిస్తూ ప్రస్తుతం రూ.1320కోట్లతో ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ సర్కారు సైతం ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ముందుకొచ్చింది. గత బడ్జెట్‌లో నిధులు సైతం కేటాయించింది. తొలి దశలో రూ.234కోట్లను కేటాయించినట్లు తెలిసింది. ఈ ప్రాజెక్టు ద్వారా 5.30టీఎంసీలను నిల్వ చేసి లిఫ్ట్ పద్ధతి ద్వారా వివిధ ప్రాంతాలకు సాగునీటిని అందించాలని ప్రతిపాదించింది. ఇటీవల నీటిపారుదల, రెవెన్యూశాఖ అధికారులు ప్రాజెక్టు ప్రతిపాదిత స్థలానికి వెళ్లి పరిశీలన చేపట్టారు. దీంతో రైతులు అధికారుల తీరును తీవ్రంగా నిరసించారు. తమకు కనీసం మాట మాత్రమైనా చెప్పకుండా భూముల సర్వే చేపట్టడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ బతుకు జీవనాధారమైన పంట పొలాలను ప్రాజెక్టుకు ఇచ్చేదిలేదని స్పష్టం చేస్తుండటం గమనార్హం.

భూములు ఇచ్చేది లేదంటున్న రైతులు

కుప్టి ప్రాజెక్టు పరివాహక ప్రాంతంలో సుమారు 2500 ఎకరాల వరకు పంట పొలాలున్నాయి. ఇక్కడ రైతులకు 90శాతం ఇరిగేషన్ ఉండటంతో ఏటా రెండు పంటలు తీస్తున్నారు. ఖరీఫ్‌లో పత్తి, సోయాతో పాటు రబీలో మొక్కజొన్న, జొన్న, పంటలు పండిస్తూ జీవనం సాగిస్తున్నారు. ముఖ్యంగా మార్కెటింగ్ సౌకర్యంతో పాటు వివిధ అవసరాలకు నిమిత్తం బయటకు వెళ్లాలంటే జాతీయ రహదారి సౌకర్యం సైతం ఉంది. గతంలో పంట దిగుబడి సక్రమంగా రాకపోయే సరికి కొంత ఇబ్బందులు పడ్డామని.. గత పదేండ్లుగా ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయిందని..బోథ్ తాలుకాలో తామే అధికంగా పంటలు పండిస్తామని మార్క్‌ఫెడ్ లెక్కల ప్రకారం 76వేల క్వింటాల్‌ల మొక్కజొన్న పండించామని చెబుతున్నారు. ఈ ప్రాజెక్టుకు భూములు కోల్పోతే తమ జీవనాధారం కష్టతరంగా మారుతుందని.. దీంతో గ్రామస్తులంతా కలిసి ప్రాజెక్టు నిర్మించకూడదని.. భూములు ఇచ్చేదిలేదని స్పష్టం చేస్తూ ఏకగ్రీవం తీర్మాణం చేసినట్లు చెబుతున్నారు. మరోపక్క ఇతర చోట్ల నిర్మించిన ప్రాజెక్టులకు సంబంధించి భూములు కోల్పోయిన వారికి సరైన పునరావాసంతో పాటు పరిహారం కూడా సక్రమంగా అందించిన దాఖలాలు లేవని స్పష్టం చేస్తున్నారు.



ముంపుకు గురయ్యే భూములు

పచ్చని పొలాలు కోల్పోతాం : వెంకటరమణ, రైతు, కుప్టి



అనేక ఏండ్లుగా పంట పొలాలను నమ్ముకొని వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్నాం. ఇక్కడి పంటలకు 90శాతం నీటి వసతి ఉండటంతో ఏటా రెండు పంటలు తీస్తున్నాం. భూములు కోల్పోతే తాము జీవనాధారం కోల్పోయే పరిస్థితి ఉంటుంది. ముఖ్యంగా అధికారులకు తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వచ్చి సర్వే చేపట్టడం సరైంది కాదు. ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

ఏకగ్రీవ తీర్మానం చేశాం : కొయ్యడి గంగయ్య, రైతు, కుప్టి



గ్రామంలో ప్రాజెక్టు నిర్మిస్తే విలువైన పచ్చని పంట పొలాలను కోల్పోవాల్సి ఉంటుంది. రూ.కోట్ల విలువైన భూములను కోల్పోయేందుకు తాము సిద్ధంగా లేము. గ్రామస్తులంతా కలిసి ప్రాజెక్టుకు భూములు ఇవ్వకూడదని తీర్మాణం చేశాం. ఉన్న భూమిని ప్రాజెక్టుకు ఇచ్చేస్తే తాము జీవనాధారం కోల్పోతాం. మరోపక్క అధికారులు గ్రామస్తులకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా సర్వే కోసం రావడం సరైంది కాదు.

గంజాయి క్రయ విక్రేతల అరెస్ట్

55 గ్రాముల గంజాయి స్వాధీనం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

మండలంలోని ఈజ్‌గాం బెంగాళీ క్యాంప్ నెం.1లో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించి గంజాయి క్రయవిక్రేతలు ఆరుగురిని అరెస్ట్ చేశారు. వీరి నుండి 55 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపిన ప్రకారం..గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ సర్కార్ మహారాష్ట్ర నుండి గంజాయి తీసుకొచ్చి చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి కాగజ్‌నగర్, చింతగూడ, బురదగూడ ప్రాంతాలలో నివాసముండే విద్యార్థులు, యువకులకు విక్రయిస్తున్నాడు. శుక్రవారం కూడా రాజ్‌కుమార్ సర్కార్ ఈజ్‌గాంలోని నిర్మానుష్య ప్రాంతానికి వీరిని పిలిపించి ఒక్కో ప్యాకెట్‌ను రూ.500కు విక్రయిస్తున్నాడు. అదే సమయంలో రెండు బృందాలుగా ఏర్పడ్డ టాస్క్‌ఫోర్స్ అధికారులు, సిబ్బంది దాడులు చేసి వీరిని పట్టుకున్నారు. వీరి నుండి రూ.5 వేల విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ అధికారులు అరెస్ట్ చేసిన వారిలో రాజ్‌కుమార్ సర్కార్‌తో పాటు కాగజ్‌నగర్ మారుతినగర్‌కు చెందిన బోసంలా భీమేష్, పాకీజానగర్‌కు చెందిన ఎండి ఆరీఫ్ హుస్సేన్, నౌగాంబస్తీకి చెందిన ఎస్‌కె తన్వీర్, బోరిగాం గ్రామానికి చెందిన కామ్రే కార్తీక్, ఎండి అతీక్‌లు ఉన్నారు. వీరిని ఈజ్‌గాం పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. ఈ దాడులలో సీఐతో పాటు ఎస్ఐ వెంకటేష్, కానిస్టేబుళ్లు మధు, రమేష్ పాల్గొన్నారు.



అరెస్ట్ చేసిన వారితో టాస్క్‌ఫోర్స్ అధికారులు, సిబ్బంది

లిక్కర్ మార్ట్‌లో దొంగతనం చేసి నిందితుల పట్టివేత

నవతెలంగాణ-నేరడిగొండ

వరుణ్ లిక్కర్ మార్ట్‌లో దొంగతనం చేసిన నిందితులను పట్టుకున్నామని సీఐ భీమేష్ తెలిపారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ప్రధాన నిందితుడు చౌహన్ రవి కొంతమందిని పోగేసి దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఇలా పలుచోట్ల దొంగతనాలు చేశారు. దొంగలించిన లిక్కర్‌పై ఉన్న స్టిక్కర్ తీసేసి వైన్ షాపులలో అమ్మేవారు. ఇలా అమ్మగా మిగిలిన మద్యాన్ని మహారాష్ట్రకు తరలించేవారు. వీరి వద్ద నుండి రూ.22వేల నగదు, 50వేలు విలువ చేసే మద్యం సీజ్ చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా కారు, టాటా ఏసీ, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. నిందితులను సీసీ ఫుటేజ్, వేలి ముద్రల ఆధారంగా పట్టుకున్నట్లు తెలిపారు. వీరందరూ ఆదిలాబాద్‌కు చెందిన వారని తెలిపారు. అసలు నిందితుడు చౌహాన్ రవి పరారీలో ఉన్నాడని, అతి త్వరలో పట్టుకుంటామని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఎస్ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.



బీజేపీ సభ్యత్వ నమోదు మండల కార్యశాల



నవతెలంగాణ-ఉట్నూర్

భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు మండల కార్యశాలను శుక్రవారం పట్టణంలో నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సభ్యత్వం తీసుకోవాలని రాష్ట్ర యువ నాయకులు రితేష్ రాథోడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, మండల ప్రధాన కార్యదర్శి బింగి వెంకటేష్, కాల్వ రవి, కందుకూరి రమేష్, టేకం హరిప్రసాద్, జిల్లా నాయకులు లింగాగౌడ్, సడిగె రాజేశ్వర్, గాలి శ్రీకాంత్ పాల్గొన్నారు.

బీరు బాటిళ్లలో చెత్తాచెదారం

- ఆందోళన చెందుతున్న మద్యం ప్రియులు
- కంపెనీ నుండే అలా వస్తున్నాయంటున్న వైన్స్ యాజమానులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ ఎక్సైజ్ డివిజన్ పరిధిలోని పలు మద్యం దుకాణాలలో నాసిరకం బీర్లు లభ్యమవుతున్నాయి. రెండు రోజుల క్రితం కాగజ్‌నగర్‌లోని ఒక మద్యం దుకాణంలో మద్యం ప్రియుడు కింగ్‌ఫిషర్ ప్రీమియం బీరు కొనుగోలు చేయగా, ఆ బాటిల్‌లో చెత్త కనిపించింది. తాజాగా శుక్రవారం సిర్పూరు(టి) మండల కేంద్రంలోని ఒక మద్యం దుకాణంలో కూడా ఇదే కంపెనీ బీరును ఒక మద్యం ప్రియునికి వైన్స్ యాజమాని విక్రయించగా అందులో కూడా మొత్తం చెత్తా చెదారం నిండిపోయి ఉంది. ఈ బీర్లలో మొత్తం చెత్త కనిపిస్తుండగా, మడ్డి లాంటి పదార్థం కింద పేరుకుపోయి ఉంటోందని బీర్లు కొనుగోలు చేసిన వారు వాపోతున్నారు. బీర్ల గడువు తేదీ జనవరి, 2025 వరకు ఉన్నా కూడా బీర్లలో చెత్త తయారుకావడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ బీర్లను చూడకుండా తాగితే తమ పరిస్థితి ఏంటని వారు ఆందోళనకు గురవుతున్నారు. ఈ విషయాన్ని సదరు వైన్స్ యాజమానుల దృష్టికి తీసుకొస్తే తమ తప్పేం లేదని, కంపెనీ నుండే అలా వస్తున్నాయంటున్నారని వాపోతున్నారు. కంపెనీలోనే బీర్ల సీసాలను సరిగా శుభ్రం చేయని కారణంగానే ఈ పరిస్థితి తలెత్తుతుందని పలువురు మద్యం దుకాణాదారులు తెలిపారు. సంబంధిత శాఖాధికారులు స్పందించి దీనిపై తగు చర్యలు తీసుకోవాలని మద్యం ప్రియులు కోరుతున్నారు.

ఎస్పీఎం ఎన్నికల్లో పోటీకి ఆర్ఎస్పీ సుముఖత

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు పేపర్ మిల్లు గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పోటీ చేసేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు ఎస్పీఎం ఎంప్లాయిస్ ప్రొటెక్షన్ యూనియన్(రి.నెం.ఇ2381) వర్కింగ్ ప్రెసిడెంట్ అశ్వినికుమార్ సింగ్, వైస్ ప్రెసిడెంట్ అంబాల ఓదేలు, కార్యదర్శి వి సుభాష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించిన యూనియన్ కార్యవర్గ సమావేశంలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను యూనియన్ అధ్యక్షులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్మికుల సంక్షేమం కోసం ఆర్ఎస్పీని ఎన్నికలలో పోటీ చేయాలని కోరినట్లు తెలిపారు. రాజకీయాలంటే అసహ్యించుకునే ఈ రోజుల్లో ఏడేళ్ల సర్వీసు ఉండగానే తన అడిషనల్ డీజీపీ పదవికి రాజీనామా చేసి బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం పాటుపడుతున్న ఆర్ఎస్పీని ఎస్పీఎం కార్మికులు ఆదరిస్తారనే నమ్మకముందని తెలిపారు. జేకే యాజమాన్యం మెడలు వంచి కార్మికుల డిమాండ్లను ఆర్ఎస్పీ సాధిస్తాడని పేర్కొన్నారు. సెప్టెంబర్ 5న కాగజ్‌నగర్‌కు వస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఎస్పీఎం కార్మికులను కలువనున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలం రాజుర గ్రామానికి చెందిన బాపురావు విశ్రాంత ఉద్యోగి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి శుక్రవారం గ్రామానికి చేరుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట రాజుర మాజీ సర్పంచ్ సుందరగిరి ముత్తగౌడ్, కాంగ్రెస్ నాయకులు జిల్కారి సాయిప్రసాద్, కుర్మే పెంటన్న ఉన్నారు.



తీజ్ ఉత్సవాల్లో ఎమ్మెల్యే

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలో శుక్రవారం కస్తూర్బాగాంధీ పాఠశాలలో జరిగిన బంజారా తీజ్ ఉత్సవాల్లో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాఠశాలకు విచ్చేసిన ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు. బంజారా తీజ్ సాంప్రదాయ కార్యక్రమాలు ఎంతో ఘనంగా నిర్వహించారు. అంతేకాకుండా విద్యార్థులతో నృత్యా ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటలలో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓ.రజిత, పాఠశాల బృందం నాయకులు పాల్గొన్నారు.



ఆగిఉన్న లారీని ఢీ కొన్న కారు, మహిళ మృతి



నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని శుక్రవారం ఎన్‌హెచ్ 44వ జాతీయ రహదారి కొరటికల్ దాబా వద్ద ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టడంతో మహిళ మృతి చెందింది. ప్రమాద సమయంలో కారులో భార్యాభర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య లాస్య(35) అక్కడికక్కడే మృతి చెందగా ఆమె భర్త నాగన్న(40)కు తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరు పిల్లలు ఆయన్స్(3), ఆద్యశ్రీ(5) స్వల్ప గాయాలు కాగా నిర్మల్ ఆస్పత్రికి తరలించారు. ఎం.నాగన్న జగిత్యాలలో జూనియర్ కళాశాలలో అధ్యాపకులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. పని నిమిత్తం తన సొంత గ్రామం సిరికొండకు జగిత్యాల నుంచి కారులో ప్రయాణిస్తున్న క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలో ఎమ్మెల్యే నివాసంలో బోథ్ నియోజకవర్గానికి చెందిన 14మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ రూ.3,25,500 విలువ గల చెక్కుల శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ అర్హులైన పేదలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వీరితో పాటుగా వివిధ గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు ప్రకటించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

- బీసీ సంఘం మండలాధ్యక్షులు రవికాంత్ యాదవ్



నవతెలంగాణ-తలమడుగు

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వం బీసీల కులగణన చేపట్టి, 42శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మేకల రవికాంత్ యాదవ్ తెలిపారు. మండల బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ సభలో బీసీ కులగణన జరిపి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని ప్రకటించడం జరిగిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీ కులగణన జరిపి 42శాతం రిజర్వేషన్లు అమలు చేసి, ఎన్నికలు నిర్వహించాలన్నారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు తోట వెంకటేష్, మేకల వెంకన్న, ఆశన్న యాదవ్, ఆసం రవీందర్, గాజుల సాంబశివ్, వామన్, శ్రీనివాస్, పిడుగు వెంకన్న, రామ్ కిషన్, సురేష్, లచ్చన్న, వివిధ గ్రామాల బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు సమావేశం



నవతెలంగాణ-లోకేశ్వరం

బీజేపీ సభ్యత్వ నమోదు సమావేశాన్ని శుక్రవారం మండల కేంద్రంలోని వెంకటేశ్వర గార్డెన్‌లో సభ్యత్వ నమోదు కార్యశాలను మండలాధ్యక్షుడు జయసాగర్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. సభ్యత్వ నమోదు ప్రక్రియ కోసం పోలింగ్ బూత్ కార్యకర్తలకు శక్తి కేంద్రం ఇంచార్జీలకు, మండల పదాధికారులు వివిధ మోర్చాల పదాధికారులకు ప్రజాప్రతినిధులకు ప్రాథమిక సభ్యత్వం నమోదు చేయు విధానాన్ని వివరించారు. అందుకు కేటాయించిన టోల్ ఫ్రీ నెంబర్ 8800002024 గురించి ఆన్‌లైన్ ద్వారా నమోదు యాప్ ద్వారా నమోదు గురించి సభ్యత్వ మండల కోఆర్డినేటర్ నల్ల రమేష్ సహ కోఆర్డినేటర్ మోరె సాయినాథ్ పటేల్ మహిళా మోర్చా నాయకురాలు హీనా ఫిర్దోస్ వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పీఏసీఎస్ మాజీ చైర్మన్ చిన్నారావు, విశ్రాంత ఉపాధ్యాయులు సంటెన్న, మాజీ సర్పంచ్ గంజాల గంగాధర్, మంద భాస్కర్, మాజీ ఎంపీటీసీ పోతన్న, వివిధ గ్రామాల కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

- జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే
- ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం



ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించిన కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నవతెలంగాణ-ఇచ్చోడ

నాణ్యమైన ఆహారాన్ని అందించి లబ్ధిపొందాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పాత బస్టాండ్ ఎదురుగా ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటీన్‌ను శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజర్షిషా, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌లో కలెక్టర్, ఎమ్మెల్యే అధికారులతో కలిసి అల్పాహారం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ నాణ్యమైన ఆహారాన్ని అందించి లబ్ధి పొందాలని సూచించారు. నిధులకు సంబంధించి ఇప్పటి వరకు ఎంత ఖర్చు చేశారు. ఏమేమి వస్తువులు కొన్నారు. మిగితా హోటల్స్‌కి మీరూ ఏర్పాటు చేసే క్యాంటీన్‌కు తేడా ఏంటని అడిగి తెలుసుకున్నారు. నాణ్యతా ప్రమాణాల్లో రాజీ పడొద్దని, మంచి ఆహారాన్ని అందించాలని అన్నారు. అలాగే క్యాంటీన్‌లో ప్లాస్టిక్ కవర్లు, బాటిల్స్, వాడకూడదని, క్లాత్ కవర్స్ ఉపయోగించాలని, రేట్‌చార్ట్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ న్యాణమైన టిఫిన్, మీల్స్ అందించాలన్నారు. ఇంటి భోజనం రుచులను కస్టమర్లకు అందించాలన్నారు. ప్రజల్లో భరోసా కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతమ్‌రెడ్డి, సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు ముండే పాండు రంగ్, అధికారులు పాల్గొన్నారు.

ఆయిల్ ఫామ్ నర్సరీని సందర్శించిన కలెక్టర్



ఆయిల్‌ఫామ్ నర్సరీని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా, రైతులు

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని భరంపూర్, సుంకిడి గ్రామాల్లో శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజర్షిషా పర్యటించారు. భరంపూర్, పల్లి(కె) మధ్యన ఉన్న ఆయిల్ ఫామ్ నర్సరీని కలెక్టర్ పరిశీలించారు. ఆయిల్ ఫామ్ మొక్కలు ఆసక్తిగల రైతులకు సరిపోయే విధంగా ఉన్నాయా లేదా అని జిల్లా హార్టికల్చర్ అధికారి సుధాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. మొక్కలు పెరిగే విధానం, ఎరువులు, మందులు, చీడ పీడల నివారణ, ఆదాయం, మార్కెటింగ్ గూర్చి అధికారులను పామాయిల్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం భరంపూర్ గ్రామ సమీపంలోని ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్న రైతు చేనులోకి వెళ్లి రైతుతో మాట్లాడారు. ఆయిల్‌ఫామ్ సాగు విధానంపై రైతు పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ మెయింటెనెన్స్ గూర్చి రైతుని అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం సుంకిడి గ్రామ రైతు వేదికలో రుణమాఫీ కానీ రైతులకు సంబంధించిన డాటా నమోదుపై మండల వ్యవసాయ శాఖ అధికారిని పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు ఎలాంటి సమస్యలు విన్నవించిన అధికారులు తీర్చేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. సుంకిడి, పల్లి(కె) గ్రామస్తులు రుణమాఫీపై మండల వ్యవసాయశాఖ అధికారికి రాతపూర్వకంగా విన్నవించినప్పటికీ దరఖాస్తులు తీసుకోవడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో రైతులు ఎలాంటి సమస్యలైనా అధికారులు రైతుల ఫిర్యాదుల దరఖాస్తులు స్వీకరించాలన్నారు. రైతుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని మండల వ్యవసాయ శాఖ అధికారిని కోరారు. రుణమాఫీపై పలు సమస్యలు ఉన్నాయని, రైతులు జిల్లా కలెక్టర్‌ను కోరగా వాటిని వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఆదేశాలు వచ్చిన వెంటనే రైతులకు అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు. రుణమాఫీపై వివిధ బ్యాంకులలో పెండింగ్ విషయాలపై ఏఓను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మండల రైతులు ఆయిల్ ఫామ్ సాగుపై దృష్టి పెట్టాలని కోరారు. ప్రస్తుతం ఆయిల్ ఫామ్‌లో మూడు లక్షల మొక్కలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మిగతా 1500 ఎకరాలను గుర్తించి, ఆయిల్ ఫామ్ మొక్కలు నాటేందుకు రైతుల సిద్ధంగా ఉన్నారన్నారు. రైతులు ఖరీఫ్ పంటను తీసిన వెంటనే ఆయిల్ ఫామ్ మొక్కలను నాటుకోవాలన్నారు. గుంతలు తవ్వేందుకు కూలి డబ్బులు చెల్లించేందుకు డీఆర్‌డీఓ అధికారులతో మాట్లాడినట్టు తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా హార్టికల్చర్ అధికారి సుధాకర్, తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీఓ శేఖర్, రైతులు కేదారేశ్వర్‌రెడ్డి, రమాకాంత్, నర్సయ్య, రంజిత్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, గంగారాం, ఆశన్న, వెంకట్ యాదవ్, లక్ష్మణ్, వివిధ శాఖల అధికారులు ఆయిల్ ఫామ్ యజమాన్యం, గ్రామస్తులు ఉన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి

- ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా



నాగల్‌కొండ టీడబ్ల్యూ పీఎస్ పాఠశాలను తనిఖీ చేస్తున్న పీఓ ఖుష్బూ గుప్తా

నవతెలంగాణ-నార్నూర్

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా ఉపాధ్యాయులను సూచించారు. శుక్రవారం మండలంలోని నాగల్‌కొండ గ్రామంలోని టీడబ్ల్యూ పీఎస్ పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, భోజనంపై అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతిరోజూ మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలన్నారు. విషయాల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలనీ ఆదేశించారు. పాఠశాలలో నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతిరోజు వంటగది, స్టోర్ రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా అందులో ఒకరు పాఠశాలకు గైర్హాజరు కావడంతో తాడిహత్నూర్ స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంను సెలవు పత్రంపై ఆరా తీశారు. అంగన్‌వాడీ కేంద్రంలోను మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలని అంగన్‌వాడీ టీచర్‌ను ఆదేశించారు. వారి వెంట పాఠశాల ఉపాధ్యాయుల భీంరావ్ ఉన్నారు.

పట్టా పాస్ బుక్ ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలి



నవతెలంగాణ-తాంసి

పట్టా పాస్ బుక్ ఉండి బ్యాంకుల్లో రుణం తీసుకున్న ప్రతి రైతుకు రూ.2లక్షల రుణమాఫీ ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని కోరుతూ శుక్రవారం కప్పర్ల గ్రామానికి చెందిన రైతులు కప్పర్ల నుంచి మండల కేంద్రానికి పాదయాత్రగా వచ్చి నిరసన తెలియజేసి, తహసీల్దార్ లక్ష్మికి, మండల వ్యవసాయాధికారి రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రతీ రైతుకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని మాట ఇచ్చి ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత రుణమాఫీపై అనవసర నిబంధనలు పెట్టి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పట్టా పాస్ బుక్ కలిగి ఉండి బ్యాంకుల్లో క్రాప్‌లోన్ తీసుకున్న ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలన్నారు. కేవలం మా గ్రామంలో 30శాతం రైతులకు కూడా రుణమాఫీ కాలేదన్నారు. కుటుంబ ఆధారితంగా రేషన్ కార్డులో ఉన్న కుటుంబ సభ్యుల పేరిట రూ.2లక్షలకు పైగా ఉన్న రుణాలను చెల్లించాలని, చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎవరి పేరున మిగతా సొమ్ము కట్టాలో అర్థం కావడం లేదన్నారు. రూ.2లక్షల మాఫీ కోసం మిగతా డబ్బు కట్టడానికి అప్పు చేయాల్సి వస్తుందన్నారు. వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచించి, ఎలాంటి షరతులు లేకుండా ప్రతి రైతుకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని, లేని యెడల పార్టీల కతీతంగా రైతులు అందరం ఏకమై ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

మందిరానికి 50ప్లేట్లు అందజేత

నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని పూలాజీ బాబా ధ్యాన్ మందిరానికి అదే గ్రామానికి చెందిన పిడుగు అభిరామిరెడ్డి శుక్రవారం 50 ప్లేట్లను అందజేశారు. ఈ సందర్భంగా అభిరామిరెడ్డి మాట్లాడుతూ మండల కేంద్రంలోని పూలాజీ బాబా ధ్యాన మందిరంలో ప్రతినిత్యం యోగ, ధ్యానం కార్యక్రమాలు ఉండటంతో తమ వంతు ఉడత భక్తిగా 50 ప్లేట్లు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం మండలాధ్యక్షులు మేకల రవికాంత్ యాదవ్, సునీతారెడ్డి, అశోక్, పొచ్చన్న, నవీన్‌రెడ్డి, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పట్టభద్రులు తమ ఓటు వినియోగించుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టభద్రులు తమ అమూల్యమైన ఓటు వినియోగించుకోవాలని, ప్రొఫెసర్, విన్నర్స్ పబ్లికేషన్ అథర్ ప్రసన్న హరికృష్ణ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులతో సమావేశాన్ని నిర్వహించారు. మొదటిసారిగా వచ్చిన ఆయనకు బార్ అసోసియేషన్ సభ్యులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తను ప్రొఫెసర్‌గా పని చేస్తున్నప్పటికీ, నిరుద్యోగుల గళాన్ని వినిపించేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు. పట్టభద్రుల సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. అలాగే పట్టభద్రులైన న్యాయవాదులందరూ తమ సమస్యల పరిష్కారంలో బాగస్వామ్యులు కావాలని అన్నారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి ఎంబడి సంతోష్, మేకల మధుకర్, సంగెం సుధీర్, గంగారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అఫ్రోజ్ అహ్మద్, రాగం ప్రశాంత్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఏజెన్సీ డీఎంహెచ్‌ఓ కె.మనోహర్



నవతెలంగాణ-నార్నూర్

వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ తగు చర్యలు తీసుకోవాలని ఏజెన్సీ డీఎంహెచ్‌ఓ కుడ్మెత మనోహర్ సూచించారు. శుక్రవారం మండలంలోని బలాన్‌పూర్ గ్రామపంచాయతీలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. డ్రైడే సందర్భంగా గ్రామంలో తిరుగుతూ పరిసరాలు పరిశీలించారు. మంగళవారం, శుక్రవారం గ్రామాల్లో డ్రైడే సందర్భంగా మురుగు కాలువలు, బావిలో క్లోరినేషన్ చేసి, పరిశుభ్రత పాటించే విధంగా చూడాలని కోరారు. వారి వెంట హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్, గణేష్, కుమారి, వైద్య సిబ్బంది విమల, కైలాష్, ఆశా బొజ్జుబాయి, అంగన్‌వాడీ టీచర్ రంజనా బాయి ఉన్నారు.

ఎల్‌బీఎం పాఠశాల పూర్వ విద్యార్థినికి సన్మానం



నవతెలంగాణ-కుభీర్

మండలంలోని పార్డి(బి) ఎల్‌బీఎం పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థిని పవార్ రవీనా జూనియర్ పైలెట్‌గా ఎంపిక కావడంతో వారికి శుక్రవారం పాఠశాల ప్రదనోపాధ్యాయులు లింగిశెట్టి వెంకటేష్, ఉపాధ్యాయ బృందం విద్యార్థినిని సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్ మాట్లాడుతూ రవీనా ఒకటవ తరగతి నుంచి 4వ తరగతి వరకు ఎల్‌బీఎం పాఠశాలలో చదివి ఇక్కడి నుంచి అనంతరం పైచదువులకు గురుకుల పాఠశాల చేరిందని అన్నారు. జూనియర్ పైలెట్‌గా ఎంపికయ్యిందన్నారు. అలాంటి విద్యార్థినిని ఆదర్శంగా తీసుకొని పాఠశాలలో చదువుకునే విద్యార్థులు మంచి ఉన్నత స్థాయికి ఎదిగాలన్నారు. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అంతకు ముందు పూర్వ విద్యార్థి రవీనా విద్యార్థులను ఉద్యేశించి మాట్లాడారు. ఎల్‌బీఎం పాఠశాలలో పొందినటువంటి అనుభవాలను, తనలాగా బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిరంజీవి భోజన్న, మదవు, విద్యార్థులు ఉన్నారు.

అన్నాభావు సాఠె అడుగు జాడల్లో నడవాలి



నవతెలంగాణ-నార్నూర్

సాహిత్య సామ్రాట్ అన్నాభావు సాఠే అడుగు జాడల్లో యువత నడువాలని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్, దళిత సంఘం నాయకులు నర్సింగ్ మోరే అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన అన్నాభావు సాఠే జయంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ముందుగా నాయకులు గ్రామస్తులతో కలిసి సాఠే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. సమాజం కోసం మేధావి అన్నాభావు సాఠే చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు యూనిస్ అక్బాని, నాయకులు రాథోడ్ ఉత్తం, న్యానోబా పుష్కర్, ప్యాక్స్ ఇన్‌ఛార్జి చైర్మెన్ సురేష్ అడే, అన్నాభావు సాఠే జిల్లా అధ్యక్షుడు కాంబ్లె ఉద్ధవ్, మండలాధ్యక్షుడు కోరాల మహేందర్, మోతే రాజన్న, రాజు, సునీల్, ప్యాక్స్ డైరెక్టర్ దుర్గే కాంతారావ్, శ్రీకాంత్, ఫిరోజ్‌ఖాన్, డిగాంబర్, రాము, అనిల్, సూర్యకాంత్, గిరి, సతీష్ ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
శనివారం | 31 ఆగస్టు, 2024 | www.navatelangana.com

ప్రభుత్వ కళాశాలకు మార్కర్ బోర్డుల అందజేత

నవతెలంగాణ-కాగజ్‌నగర్



మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు విద్యాదాన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 10 మార్కర్ బోర్డులను ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సతీష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి నిరంతరం కృషి చేస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత విద్యా విధానానికి అనుగుణంగా ఆర్గనైజేషన్ వారు బోర్డులు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. దీంతో విద్యార్థులకు విషయ అవగాహన సులభం అవుతుందన్నారు. విద్యాదాన్ ఆర్గనైజేషన్‌కి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విద్యాదాన్ ఆర్గనైజేషన్ సభ్యులు, కళాశాల అధ్యాపకు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెరుచుకోని నందిగామ పాఠశాల

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండలంలోని కమ్మర్‌గాం గ్రామపంచాయతీ పరిధిలో గల నందిగాం గ్రామంలో గల గిరిజన ప్రాథమిక పాఠశాల పది రోజులుగా తెరుచుకోలేదు. పాఠశాలకు వచ్చే విద్యార్థులు పాఠశాల తాళం వేసి ఉండటంతో తిరిగి ఇంటికి వెళ్తున్నారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో ఇక్కడ పని చేసిన అనిల్ అనే ఉపాధ్యాయుడు బదిలీపై వెళ్లడంతో అప్పటి నుండి పాఠశాల తెర్చుకోవడం లేదు. బదిలీల్లో భాగంగా పాఠశాలకు వేరే ఉపాధ్యాయుడు ధర్మరావు ఇక్కడకు బదిలీ అయిన పాఠశాలలో జాయిన్ కాకపోవడంతో పాఠశాల మూతపడి ఉంది. ఇక్కడ చదువుకునే 13 మంది విద్యార్థులకు బోధించే వారే లేరు. అధికారులు స్పందించి పాఠశాల ఉపాధ్యాయునిపై చర్యలు తీసుకొని, పాఠశాలలో బోధన జరిగేలా చూడాలని తల్లితండ్రులు కోరుతున్నారు.

కోలుకుంటున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

- పరామర్శించిన పలువురు నాయకులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జ్వరంతో తీవ్ర అస్వస్థతకు గురైన ఆసిఫాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి నెమ్మదిగా కోలుకుంటున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని మలక్‌పేట్ యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఆమె ఆరోగ్యం కుదుటగానే ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా శుక్రవారం ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ జడ్పీ ఛైర్మన్ కోనేరు కృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ కుమార్ వేరువేరుగా హాస్పిటల్‌లో కలిసి పరామర్శించి ఆమె ఆరోగ్య పరిస్థితిని గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకొని ప్రజాసేవలోకి అందుబాటులోకి రావాలని కోరుకున్నారు. నియోజకవర్గంలో కార్యకర్తలు ఎమ్మెల్యే ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నారు.

ఘనంగా అన్నా బావుసాఠె జయంతి



నవతెలంగాణ-కెరమెరి

మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో అన్నాబావు సాఠె జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాఠె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెండా ఆవిష్కరించారు. దళితుల స్వేచ్ఛ, హక్కుల కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చిన మహనీయుడని వక్తలు పేర్కొన్నారు. దళిత సమాజాన్ని చైతన్యం పర్చేందుకు ఎనలేని కృషి చేశారని తెలిపారు. సాహిత్య సామ్రాట్‌గా గుర్తింపు పొందిన సాఠే దళితులకు దార్శనికుడని సేవలను కొనియాడారు. అన్నబావుసాఠే అడుగు జాడల్లో నడిచి, ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గోగర్ల రాజయ్య, దళిత నాయకులు గైక్వాడ్ రాంచందర్, కంబాల చంద్ర శేఖర్, వాగ్మారే శ్రీకాంత్, షిండే ఆకాష్, కంబాల వినేష్, రఘునాథ్, రాజేందర్, నిఖిల్, రాము, చంద్రకాంత్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో విజృంభిస్తున్న సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా వైద్య అధికారి తుకారం భట్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రులలో రోగులకు కావాల్సిన మందులు అందుబాటులో ఉండే విధంగా చూడాలన్నారు. సీజనల్ వ్యాధుల ప్రభావం ఎక్కువ ఉన్నందున ప్రతి ఒక్క ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉండే విధంగా చూడాలని, గ్రామాల్లో మలేరియా, డెంగ్యూ తీవ్ర స్థాయిలో ఉందన్నారు. జిల్లాను హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటించి గ్రామాలు, విద్యాసంస్థలు, వసతి గృహాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యాధులు విజృంభిస్తుండడంతో ప్రయివేట్ ఆస్పత్రులు దోపిడీకి పాల్పడుతున్నాయని ఆరోపించారు. వాటిని నియంత్రణ చేయడంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్లను నియమించాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గెడం టికనంద్, టీఏజీఎస్ జిల్లా అధ్యక్షురాలు కొరింగ మాలశ్రీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాజేందర్, టీఏజీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కోట శ్రీనివాస్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం నిఖిల్, డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు జాడి తిరుపతి పాల్గొన్నారు.

నిబంధనల మేరకు నడుచుకోవాలి

నవతెలంగాణ-కెరమెరి

మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ సమీపంలో చింతకర్ర రిజర్వు ఫారెస్టులో 41 కంపార్ట్ మెంట్‌లో గురువారం అటవీ శాఖ అధికారులు, రెవెన్యు అధికారులు పరిశీలించారు. సుమారు 11 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భూమిపై 2017 నుంచి అటవీ, రెవెన్యూ అధికారుల మధ్య వివాదం కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో 2017లో హైకోర్టును ఆశ్రయించారు. రెండు శాఖల అధికారులు మాదంటే మాదని పేర్కొంటున్నారు. ఇదే ప్రాంతంలో ఆంజనేయ ఆలయం నిర్మాణంలో ఉంది. గతంలో ఇదే ప్రాంతానికి రెవెన్యూ అధికారులు పట్టాలిచ్చినట్టు సమాచారం. శనివారం ఆంజనేయ ఆలయం ప్రారంభం చేయనున్నారు. ఇరు శాఖల అధికారులు ఈ ప్రదేశాన్ని పరిశీలించారు. పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. హద్దులు గుర్తించి, సర్వే చేపట్టే వరకు ఈ ప్రాంతంలో నిబంధనలు పాటించాలని అటవీ శాఖ అధికారులు తెలిపారు. స్థల పరిశీలనకు తహసీల్దార్ దత్తు ప్రసాద్ రావు, ఫరెస్టు రేంజి అధికారి మజారోద్దీన్, డిప్యూటీ తహసీల్దార్ సంతోష్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.



పూలాజీ బాబా జీవితం ఆచరణీయం

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పరమహంస సద్గురు పూలాజీ బాబా జీవితం అందరికీ ఆదర్శనీయం, ఆచరణీయమని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం సద్గురు పూలాజీ బాబా 100వ జయంతిని పురస్కరించుకొని జిల్లాలోని జైనూర్ మండల కేంద్రంలో నిర్వహించిన ఉత్సవాలకు ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా, ఎస్పీ శ్రీనివాస్ రావు, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, దుర్గు పటేల్ సార్‌మేడిలతో కలిసి హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరమహంస సద్గురు పూలాజీ బాబా ఆచరించిన జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. మనం చేసే ప్రతి పని చిత్తశుద్ధితో చేయాలని, నేను చేయగలను అనే ధృడ నమ్మకంతో ముందుకు సాగాలన్నారు. చెడు మార్గాలను, ఆలోచనలను వదిలి మంచి ఆలోచనతో సన్మార్గంలో అభివృద్ధి చెందాలన్నారు. ప్రతి ఒక్కరూ తాము ఎదగడంతో పాటు తోటి వారి అభివృద్ధికి తమ వంతు సాయం అందించాలన్నారు. ప్రభుత్వం ఆదివాసీ, గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, గిరిజన గ్రామాలలో విద్య, వైద్యం ఇతర అన్ని మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా కృషి చేస్తుందని తెలిపారు. ధ్యానం ద్వారా మనిషి తనలోని కోపాన్ని, ఆవేశాలను అణచుకొని ప్రతి సందర్భాన్ని ప్రశాంతంగా నిర్వహించే సమర్థతను సాధించవచ్చని బాబా ఆచరించి చూపారని తెలిపారు. ఖానాపూర్ ఎమ్మెల్యే మాట్లాడుతూ పూలాజీ బాబా బోధించిన ప్రవచనాలతో ఎంతోమంది తమ జీవన మార్గాలను మార్చుకొని అభివృద్ధి చెందారన్నారు. ఆయన బోధించిన ఆధ్యాత్మిక, సత్య జ్ఞానంతో ఎంతోమంది తమ జీవితాలను సన్మార్గాల వైపు మార్చుకొని నేడు సంతోషంగా జీవిస్తున్నారని తెలిపారు. మూఢ నమ్మకాలలో జీవించే ప్రజలను ఆత్మ జ్ఞానము ధ్యాన మార్గం ద్వారా ప్రబోధించి వారిని చైతన్య పరిచారని తెలిపారు. జయంతి వేడుకలకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుండే కాకుండా మహారాష్ట్ర, రాజస్థాన్ ఇతర రాష్ట్రాల నుండి లక్షలాది మంది హాజరు కావడం సంతోషంగా ఉందన్నారు. పూలాజీ బాబా ఆశయాలను నెరవేర్చే విధంగా భావితరాలకు అందించాలని తెలిపారు. బాబా జయంతి వేడుకలను మరింత ఘనంగా నిర్వహించేందుకు కృషి చేయడంతో పాటు గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై ప్రభుత్వానికి నివేదించి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ఆదివాసీ సంఘాల నాయకులు, పటేళ్లు, సర్‌మేడిలు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

- అఖిల పక్షం ఆధ్వర్యంలో ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న తుడుందెబ్బ, అఖిలపక్షం నాయకులు

నవతెలంగాణ-తిర్యాణి

ఎలాంటి షరతులు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ ప్రతి ఒక్క రైతుకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని శుక్రవారం మండలంలోని కుమురం భీం చౌరస్తాలో తుడుందెబ్బ, అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రైతులకు రుణమాఫీ వెంటనే చేయాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి ఒక్క రైతుకు రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు షరతుల పేరిట రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ బుద్ధి బయటపడిందని అఖిలపక్షం నాయకులు పేర్కొన్నారు. అనంతరం రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్ ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని, రాస్తారోకోను విరమింప చేయాలని కోరడంతో అక్కడి నుండి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ సునీల్‌కుమార్ దేశ్పాండేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెడ్మ భగవంత్‌రావు, మాజీ జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గుణవంత్‌రావు, మాజీ ఎంపీటీసీ రమేష్ గౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు పులి వెంకటేష్, వివిధ పార్టీల నాయకులు పోలస రమేష్, వాసాల సత్యనారాయణ, ఆకుల సత్తయ్య, మడావి శ్రీరాములు పాల్గొన్నారు.

ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణాన్ని మొదలు పెట్టాలి

- ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్ బాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు

నవతెలంగాణ-సిర్పూర్(టి)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రతి ప్రాజెక్టు అవినీతితో నిండి ఉందని, జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును పూర్తి చేయించాలని ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్ బాబు, తెలంగాణ జల సాధన సమితి అధ్యక్షులు నైనాల గోవర్ధన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రాణహిత ప్రాజెక్టును కాళేశ్వరానికి తరలించడంలో మెగా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ అధినేత కృష్ణారెడ్డి హస్తం ఉందని, రాష్ట్ర అప్పును రూ.70 వేల కోట్ల నుంచి రూ.7 లక్షల కోట్లకు పెంచడంలో ఆయన ఎనలేని కృషి చేశారని ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టారని, కేసీఆర్ కుటుంబం మొత్తం కాళేశ్వరాన్ని అడ్డం పెట్టుకొని అక్రమ సంపాదన చేసిందని ఆరోపించారు. ఈ వార్షిక బడ్జెట్‌లో కేవలం రూ.250కోట్లు ప్రాణహిత ప్రాజెక్టుకు కేటాయించి కాంగ్రెస్ ప్రభుత్వం చేతులు దులుపుకుందని, వెంటనే డీపీఆర్ సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని డిమాండ్ చేశారు. తూర్పు ఆదిలాబాద్ జిల్లాలోని 5 నియోజకవర్గాలకు నీళ్ళు ఇచ్చిన తర్వాతనే హైదరాబాద్ నగరానికి, దక్షిణ తెలంగాణకు నీటిని తరలించాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్ గౌడ్, మండల అధ్యక్షులు ఎల్ములె శంకర్, ఎల్ములె మల్లయ్య, దుర్గం మోతిరాం, తుకారాం, నేరెళ్ళ అశోక్, ఒడ్డేటి నాని, దుర్గం ప్రశాంత్, సాయి, జావిద్ అహ్మద్, శ్రీను, నానాజీ పాల్గొన్నారు.

పారిశుధ్యం లోపించకుండా చూడాలి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా కార్మికులు నిరాంతరం శుభ్రం చేయాలని మండల ప్రత్యేక అధికారి ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎలుకపెల్లి, ఎల్లూరు, చెడువాయి గ్రామాలను ఎంపీడీఓ ఆల్బర్ట్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా చేడువాయి, ఎలకపెల్లి గ్రామాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. గ్రామపంచాయతీ కార్మికులకు గ్రామంలో ఎప్పటికప్పుడు పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని సూచించారు. ఎల్లూర్‌లో ఐకేపీ ద్వారా నిర్మించిన ఫిష్ ఫాండ్ సందర్శించి చేపల నిర్వహణ గురించి వివరాలు అడిగి తెలుసు కున్నారు. అనంతరం ఎల్లూర్ ఆశ్రమ పాఠశాలలో సందర్శించి మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంటలను పరిశీలించారు. పిల్లల ఆరోగ్యంపై తీసుకుంటున్న జాగ్రత్తలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎలుకపెల్లి లోని కేజీబీవీ పాఠశాలలో నిర్వహించిన మెడికల్ క్యాంపులో పాల్గొన్నారు. విద్యార్థుల ఆరోగ్య దీక్ష అన్ని పాఠశాలలో మెడికల్ క్యాంపులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం కోనయ్య, పంచాయితీ సెక్రెటరీ కిష్టయ్య, చంద్రశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రేమనందం పాల్గొన్నారు.

భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు

నవతెలంగాణ-కౌటాల

మండలంలోని అరే సంక్షేమ భవన్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు సమక్షంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా అధికార ప్రతినిధి సమీర్ గుప్తా పాల్గొన్నారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసు పథకాలను ప్రల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. బీజేపీ మండల అధ్యక్షుడు నారులే వాను పటేల్, మండల ప్రధాన కార్యదర్శి మృత్యుంజయ్ కవిరాజ్, జిల్లా కార్యదర్శి కుంచల సత్తయ్య, జిల్లా ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడు ఊరువాత్ బాజీరావు, మండల ఎస్సీ మోర్చా అధ్యక్షుడు బండురావ్, మండల సోషల్ మీడియా కన్వీనర్ చౌదరి సునీల్, మండల ఉపాధ్యక్షుడు ఆత్రం



భూమయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సాయం అందించాలి



నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థి దుర్గం అర్జున్ జేఈఈ ఎంట్రెన్స్ పరీక్షలో 1782 ర్యాంకు సాధించి జోగ్‌పూర్ ఐఐటీ కళాశాలలో సీట్ సాధించారు. ఒక నిరుపేద కుటుంబం నుండి వెనుకబడిన జిల్లా కుమురం భీం-ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం నుండి ఐఐటీ ర్యాంకు సాధించడం జిల్లాకే గర్వకారణం. ఐఐటీలో మంచి ర్యాంకు సాధించిన దుర్గం అర్జున్‌కు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సాయం అందించాలని ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ), కేవీపీఎస్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ఐటీ కార్పొరేట్ ఈడీ సంజీవ్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన ఈడీ సంజీవ్ మాట్లాడుతూ ఐఐటీ విద్యార్థికి ఆర్థిక సాయం అందించేందుకు తనవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, విద్యార్థి తల్లిదండ్రులు దుర్గం మహేందర్-జ్యోతి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

భూనిర్వాసితులకు సింగరేణి యాజమాన్యం పని కల్పించాలి



నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణిలో భూములు కోల్పోయిన భూనిర్వసితులకు యాజమన్యం పని కల్పించాలని హెచ్ఎంఎస్ బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ రాజబాబు అన్నారు. శుక్రవారం బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీ అధికారి కోటయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో భూములు కోల్పోయి ఇలాంటి పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జీవన ఆధారమైన భూములను ఓపెన్ కాస్ట్ విస్తరణకు ఇచ్చారన్నారు. భూములు కోల్పోయిన వారికి యాజమాన్యం సింగరేణిలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పని కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ భూనిర్వసితులకు గోలేటి సీహెచ్‌పీలో చేస్తున్న టెండర్ రద్దు చేయడం వల్ల భూనిర్వసితుల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. సింగరేణి యాజమాన్యం మానవత ధృక్పథంతో ఆలోచించి భూములు కోల్పోయిన వారికి కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ పనులలో అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఆర్గనైజింగ్ కార్యదర్శి శంకరమ్మ, రాజేశ్వరి, నాగమణి, పార్వతి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆపన్న హస్తం



నవతెలంగాణ-కెరమెరి

మండల కేంద్రానికి చెందిన చౌదరి రమేష్(30) పిడుగు పాటుకు గురై మరణించాడు. రమేష్-సుమిత్ర దంపతులు కెరమెరికి చెందిన ఓ రైతు వద్ద కొంతకాలంగా పాలేరుగా పని చేస్తున్నా సమయంలో పిడుగు రూపంలో ఆ కుటుంబాన్ని చిన్నా భిన్నం చేసింది. భార్య సుమిత్ర, నాలుగేండ్లలోపు ఉన్న ఇద్దరు చిన్నారులను ఎలా పోషించాలో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్న బాధిత కుటుంబానికి మేమున్నామంటూ ముందుకొచ్చారు పూలే సేవా సమితి సభ్యులు. అనుకున్నదే తడవుగా కొంతమంది దాతల సహకారంతో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఎస్సై గుంపుల విజయ్ కుమార్ చేతుల మీదుగా రూ. 23,055 అందించారు. మృతుని కుటుంబానికి అండగా నిలిచి సాయాన్ని అందించి మానవత్వం చాటుకున్న సమితి సభ్యులను ఎస్ఐ అభినందించారు. కార్యక్రమంలో మాలీ సంఘం మాజీ మండల అధ్యక్షుడు వాడై సుభాష్, కోట్రంగే తిరుపతి, పూలే సేవా సమితి సభ్యులు మొహర్లే తిరుపతి, మొహర్లే సుధాకర్, చంద్రు, శ్రీనివాస్, శంకర్, గుర్లే మారుతి, నికోడె అర్జున్, గ్రామస్థులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడిన వారిని శిక్షించాలి

నవతెలంగాణ-రెబ్బెన

గోలేటి గ్రామంలో ఎస్‌బీఎం(మరుగు దొడ్లు), ఇంకుడు గుంతలలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిని శిక్షించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. గతంలో కలెక్టర్‌కు ఎస్‌బీఎం, ఇంకుడు గుంతల విషయంలో ఫిర్యాదు చేశారు. శుక్రవారం డీఆర్‌డీఏ దత్తారావు, ఎంపీడీఓ శంకరమ్మ, ఏపీఓ కల్పన, రాంమోహన్ రావు ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా బోగే ఉపేందర్ మాట్లాడుతూ లబ్దిదారులకు వెంటనే డబ్బులు చెల్లించాలని లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
శనివారం | ఆగస్టు 31, 2024 | www.navatelangana.com

రుణమాఫీలో రేషన్ కార్డు లేని కుటుంబాల సర్వే



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని దేవునిగూడ గ్రామములో శుక్రవారం రుణమాఫీ పథకంలో రేషన్ కార్డు లేని రైతులకు కుటుంబ సభ్యుల ధ్రువీకరణ మండల వ్యవసాయ అధికారి సంగీత ఆధ్వర్యంలో సర్వేనిర్వహించారు. రేషన్ కార్డు లేని వారికి మాత్రమే ప్రస్తుతం సర్వే నిర్వహించి ఆప్‌లో లైవ్ ఫోటో తీసుకోవటం జరుగుతున్నదని ఆమె రైతులకు వివరించారు. వ్యవసాయ విస్తరణ అధికారి అక్రముల్ల, కిష్టపూర్ కామన్ పల్లి గ్రామ శివారు రైతులు పాల్గొన్నారు.

2న కలెక్టరేట్ల ముట్టడి విజయవంతం చేయండి

నవతెలంగాణ-జన్నారం

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కులగనన వెంటనే ప్రారంభించాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని బీసీ సంక్షేమ సంఘం మండల కన్వీనర్ కడారుల నర్సయ్య హెచ్చరించారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం, బీసీ కుల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కులగణనను వెంటనే ప్రారంభించాలని, బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 2న కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



పొలాల పండగకు మూడు రోజులు సెలవు ఇవ్వాలి



నవతెలంగాణ-నస్పూర్

పొలాల అమావాస్య పండుగను పురస్కరించుకొని సెప్టెంబర్ 2 నుంచి మూడు రోజుల పాటు ప్రభుత్వం సెలవు దినలుగా ప్రకటించాలని నేతకని సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి గోళ్ళ రాజమల్లు, అనపర్తి యువరాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఏఓ రాజేశ్వర్ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొలాల అమావాస్య పండగను ఎంతో పవిత్రంగా జరుపుకుంటామని, స్వర్గస్థులైన పూర్వీకులకు, గోవులకు భక్తి, శ్రద్ధలతో పూజలు చేసుకుంటామని తెలిపారు. అందుకే నేతకాని ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులకు ప్రభుత్వం సెలవు ప్రకటించాలని, ప్రభుత్వం తమ మనోభావాలను గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెమెరా అనూష, కొండగొర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అశ్రమ పాఠశాలను సందర్శించిన కార్పొరేషన్ చైర్మన్



నవతెలంగాణ-లక్సెట్టిపేట

పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను రాష్ట్ర గిరిజన ఆర్థిక అభివృద్ధి కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి శుక్రవారం సందర్శించారు. ప్రతి తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలు, ఇటీవల జరిగిన పరిణామాలను ఉపాధ్యాయులతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల పర్యావరణం, తాగునీరు, వంటగది పరిశీలించి ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ మల్లారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ పాల్గొన్నారు.

2న కలెక్టరేట్ ఎదుట ధర్నాను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-నస్పూర్

ప్రజల సమస్యలపై సెప్టెంబర్ 2వ తేదీన కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, మున్సిపల్ 17వ వార్డు కౌన్సిలర్ మేకల దాసు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియాలోని కార్యాలయంలో మాట్లాడుతూ పెరుగుతున్న ధరలను నియంత్రించాలని, ముఖ్యంగా సింగరేణి ప్రాంతంలో నివసిస్తున్న వారందరికీ పట్టాలను అందజేయాలని అన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలో కొంతమందికి పట్టాలు అందజేసి మరికొందరికి ఇవ్వకపోవడం సరికాదని అన్నారు. మిగిలిన వారికి కూడా జీఓ 76 ప్రకారం పట్టాలను అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ శ్రీరాంపూర్ ఏరియా కార్యదర్శి పూజారి రామన్న, సహాయ కార్యదర్శి కొత్తపల్లి మహేష్, జక్క మొగిలి, సర్వ శ్రీనివాస్, తోట రాజేష్ పాల్గొన్నారు.

దొంగతనం కేసులో నిందితుడికి జైలు

నవతెలంగాణ-వేమనపల్లి

దొంగతనం కేసులో నిందితుడికి జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ బెల్లంపల్లి జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జె.ముకేశ్ శుక్రవారం తీర్పు ఇచ్చారు. ఈ ఏడాది మే నెలలో వేమనపల్లి మండలం క్యాతనపల్లి గ్రామానికి చెందిన నెండుగురి రామన్న ఇంట్లో సల్పల శ్రీనివాస్ అనే వ్యక్తి 14.75 తులాల బంగారం, 6 తులాల వెండి, రూ.2,62,600 చోరీ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ శ్యామ్ పటేల్ ఆధారాలతో చార్జిషీటు బెల్లంపల్లి కోర్టులో దాఖలు చేశారు. ఈ కేసులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె అజయ్ వాదనలతో ఏకీభవించిన బెల్లంపల్లి జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జె ముకేశ్ నిందితుడికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషిచేసిన ఎస్ఐ శ్యామ్ పటేల్, కోర్టు కానిస్టేబుల్ సంపత్‌ను రూరల్ సీఐ సుధాకర్ అభినందించారు.

స్థానిక సమస్య పరిష్కారమే ఎజెండాగా పనిచేయాలి

- మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి

నవతెలంగాణ-తాండూర్



ప్రతి కార్యకర్త స్థానిక సమస్యల పరిష్కారమే ఏజెండాగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి అన్నారు. శుక్రవారం తాండూరు మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతి కార్యకర్త ప్రజల సమస్యలే ఏజెండాగా పనిచేయాలని సూచించారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. ప్రజా సమస్యలపై పోరాడే పార్టీలకే ప్రజల్లో ఆదరణ లభిస్తుందన్నారు. పార్టీ పిలుపుమేరకు బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు భరత్ కుమార్ సభ్యత్వ నమోదు జిల్లా కోకన్వీనర్ చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, ఎస్సీ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి పాగిడి చిరంజీవి, బీజేపీ సీనియర్ నాయకులు చిలువేరు శేషగిరి, మండల ఉపాధ్యక్షుడు పుట్ట కుమార్, బీజేవైఎం మండల అధ్యక్షుడు మామిడి విగ్నేష్, బీజేపీ నాయకులు ఏముర్ల ప్రవీణ్, కొమ్మ కొమురెల్లి, బాపు పాల్గొన్నారు.

హెచ్ఐవీ నియంత్రణకు ప్రత్యేక చర్యలు

- జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి హరీష్‌రాజ్

నవతెలంగాణ-నస్పూర్



హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణకు జిల్లాలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి హరీష్ రాజ్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన దిశ కార్యక్రమంలో భాగంగా హెచ్ఐవీ ఎయిడ్స్ స్క్రీనింగ్ పరీక్షలపై పల్లె దవాఖానాలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ హెచ్ఐవీ ఎయిడ్స్ నియంత్రణ దిశగా జిల్లా వ్యాప్తంగా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై పరీక్షలు నిర్వహిస్తున్నట్లు, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించువాలని కోరారు. వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధులు, విషజ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపట్టడంతో పాటు గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఇంటింటికి తిరుగుతూ వ్యాధుల వ్యాప్తి నియంత్రణకు పాటించవలసిన జాగ్రత్తలపై వివరించాలని, వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని నిర్ణీత ఫార్మాట్లో వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ఆరోగ్య కేంద్రాల పరిధిలో గర్భం దాల్చిన మహిళలు తమ వివరాలు నమోదు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని, సకాలంలో పరీక్షలు నిర్వహించి టీకాలు వేయాలని, అవసరమైన మందులు అందించాలని, ఆసుపత్రులలో ప్రసవాలు చేసుకునే విధంగా వివరించాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటిస్తూ ఆరోగ్య కేంద్రాలలో అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందించాలని తెలిపారు. వ్యాధుల నిర్ధారణ, మందుల పంపిణీ, టెలీ మనస్‌తో పాటు వైద్యారోగ్యశాఖ పరిధిలో నిర్వహించే రాష్ట్రీయ, జాతీయ కార్యక్రమాలలో తప్పనిసరిగా పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ ఉప వైద్యాధికారి డా.సుధాకర్‌నాయక్, వైద్యాధికారులు డా.ప్రసాద్, డా సీతారామరాజు, డా.ఎస్ అనిత, డా. అనిల్, డీపీఓ ప్రశాంతి, ఎయిడ్స్ జిల్లా అధికారి నీలిమ రాజేష్ పాల్గొన్నారు.



మున్సిపల్ సమావేశానికి కలెక్టర్ హాజరు

నవతెలంగాణ-తాండూర్



బెల్లంపల్లి మున్సిపల్ సాధారణ సమావేశం శుక్రవారం చైర్‌పర్సన్ జక్కుల శ్వేతా అధ్యక్షతన నిర్వహింగా కలెక్టర్ కుమార్ దీపక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభ్యుల ఆమోదం మేరకు పలు తీర్మానాలు చేశారు. బెల్లంపల్లిలో నూతనంగా నిర్మించిన మార్కెటింగ్ భవనంలో కేటాయించిన 105 షాపులకు ఒక్కో షాపుకు రూ.20, వేలు డిపాజిట్ చెల్లించాలని తీర్మానించారు. షాపు యజమానులు రూ.100 బాండ్ పేపర్‌పై అగ్రిమెంట్ చేసుకొని నెలకు 3వ తేదిలోపు రూ.2 వేలు అద్దె చెల్లించాలని తీర్మానించారు. వ్యాపారస్తులు వరుసగా మూడు నెలలు అద్దె చెల్లించనియెడల నోటీసు లేకుండా ఆ షాపును వేరే వారికి కేటాయించే అధికారం ఉంటుందని, డిపాజిట్ మొత్తము జప్తు చేసే విధంగా తీర్మానించారు. మార్కెట్ భవనంలోని 27 షెటర్స్ షాపులు ఉండగా లక్కీ డ్రాలో షెటర్లను పొందిన వ్యాపారులు రూ 50 వేలు డిపాజిట్ రూపంలో చెల్లించి, రూ.100 బాండ్ పేపర్ పై అగ్రిమెంట్ చేసుకోవాలని తీర్మానంలో పేర్కొన్నారు. ముందువైపు ఉన్న షట్టర్స్‌కు నెలకు రూ.6 వేలు, లోపలి వైపు ఉన్న షెటర్స్‌కు నెలకురూ.4,500- అద్దె నిర్ణయించారు. వినాయక నిమర్జనంలో భాగంగా వినాయక విగ్రహాలను పోచమ్మ చెరువులో నిమజ్జనం చేసేందుకు మున్సిపల్ సాదారణ నిధుల నుంచి ఖర్చు చేసేందుకు కౌన్సిల ఆమోదం తెలిపింది. సద్దుల బతుకమ్మ దసరా పండుగ సందర్భంగా బెల్లంపల్లి పట్టణంలో మహిళలు బతుకమ్మ ఆడే స్థలంలో లైటింగ్ అరేంజ్మెంట్స్ ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ సాధారణ నిధుల నుంచి ఖర్చు చేయుటకు కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. ఈ సమావేశములో మున్సిపల్ కమీషనర్ కె శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది



నవతెలంగాణ-తాండూర్

సమాజంలో వృత్తిపరంగా అధ్యాపక వృత్తి ఎంతో ఉన్నతమైనదని అంకితభావంతో పనిచేస్తే సమాజంలో గుర్తింపు లభిస్తుందని తాండూర్ మండల విద్యాధికారి ప్రభాకర్ రావు అన్నారు. శుక్రవారం రేచిని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయురాలు ప్రమీల రాణి ఉద్యోగ విరమణ సదర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తల్లిదండ్రులతో పాటు భావితరాల భవిష్యత్తుకు పునాదులు వేసే బాధ్యతాయుతమైన వృత్తి అధ్యాపక వృత్తి అని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తిలో మనమందరం పనిచేయడం ఎంతో గర్వించదగ్గ విషయమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ప్రతి ఉపాధ్యాయుడు సమాజానికి సేవ చేసిన వారు అవుతారని తెలిపారు. ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన వసతి సౌకర్యాలను ఉపయోగించుకొని పేద బడుగు బలహీన వర్గాల పిల్లల అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయులు విద్యార్థికి నేర్పించే ప్రతి పాఠ్యాంశం సమాజ అభివద్ధికి సంఘ సంస్కరణకు తోడ్పాటు అవుతుందని అన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందుతున్న ప్రమీల రాణి ఉపాధ్యాయురాలుకు పూలమాలలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి మల్లేశం, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రదీప్ కుమార్, జయప్రద, ఉపాధ్యాయ సిబ్బంది సతీష్ కుమార్, రవి, మంజుల, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, కృష్ణగౌడ్, సంతోష్ కుమార్, నాగమణి, సావిత్రి, శ్రీలత పాల్గొన్నారు.

రుణమాఫీకి అర్హత ఉన్న వారు ఆందోళన చెందొద్దు

- జిల్లా వ్యవసాయ అధికారి కల్పన

నవతెలంగాణ-తాండూర్



అర్హత కలిగి రుణమాఫీ కానీ రైతులు ఆందోళన చెందొద్దని జిల్లా వ్యవసాయ అధికారి కల్పన సూచించారు. శుక్రవారం బెల్లంపల్లి మండలం ఆకెనపల్లిలో వ్యవసాయ అధికారులు నిర్వహిస్తున్న కుటుంభ నిర్ధారణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులందరికీ రుణమాఫీ వర్తించేలా వ్యవసాయ శాఖ కసరత్తు చేస్తుందని తెలిపారు. మండలాల్లోని క్లస్టర్ గ్రామాల వారిగా రుణమాపికి అర్హత గల రైతుల వద్ద నుండి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని వ్యవసాయ అధికారులు కుటుంబ నిర్ధారణ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. అర్హత కలిగి రైతు రుణమాఫీ కానీ రైతులు కుటుంభ నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. రైతులు కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులను అనుసంధానం చేసుకొని, వ్యవసాయ అధికారితో కుటుంభ సభ్యులతో కలిసి ఫోటో దిగాలని తెలిపారు. వ్యవసాయ అధికారులు స్థానిక రైతుల సహకారంతో కుటుంబ నిర్ధారణ కార్యక్రమాన్ని త్వరతగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి వ్యవసాయ అధికారి ప్రేమ్ కుమార్, ఏఈఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా నిర్వహణపై సమావేశం



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని గ్రామ పంచాయతీలలో వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని, అన్ని గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికల్లో భాగంగా గ్రామ పంచాయతీల వారిగా ఓటర్ల జాబితా మెర్జింగ్ స్టేట్మెంట్ తయారు చేసి టీ పోల్లో నమోదు చేయడానికి రెడీగా ఉండాలని సూచించారు. ఏమైనా తప్పులు, పోలింగ్ బూతుల వారిగా మిగిలి పోయిన ఓటర్లను గుర్తించి సంబంధిత గ్రామ పంచాయతీలలో మెర్జింగ్ చేయాలని తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీలలో పారిశుధ్య పనులు నిరంతరంగా చేయాలని, క్లోరినేషన్ చేయాలని, వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో మండల పంచాయతీ అధికారి షేక్ సప్దర్ అలీ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మసీదు వాడలో విష జ్వరాలు

నవతెలంగాణ-తాండూర్

మండల పరిధిలోని తాండూర్, ఐబీ, మస్జీద్ లైన్, సుభద్ర కాలోని ఏరియాలో చాలామంది జ్వరాలతో బాధపడుతున్నారని మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాబీర్ హుస్సేన్ ఒక ప్రకటనలో ఆరోపించారు. పారిశుధ్య లోపం కారణంగా కాలనీలో దోమలు వృద్ధి చెంది విష జ్వరాలు ప్రబలుతున్నట్టు తెలిపారు. పంచాయతీ అధికారులు దోమల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. పరిసరాల శుభ్రత వ్యక్తిగత శుభ్రతలపై అవగాహన కల్పించే వైద్యాధికారులు, ఆశా కార్యకర్తలు కాలనీల్లో పర్యటించడం లేదని ఆరోపించారు. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

డిప్యూటీ సీఎం పర్యటనను అడ్డుకుంటాం

నవతెలంగాణ-లక్సెట్టిపేట

ఈ నెల 31న మంచిర్యాల జిల్లా పర్యటనకు వస్తున్నా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను అడ్డుకుంటామని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈశ్వర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి తీరని అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. విద్యార్థులకు కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా 100 రోజులో ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ విడుదల చేస్తాం అని మాట ఇచ్చి ఇంటర్నేషనల్ స్కూల్స్ కడతాం అని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక కనీసం విద్యా శాఖకు మంత్రిని కూడా నియమించలేని చేతకాని ప్రభుత్వ తీరుని నిరసిస్తూ డిప్యూటీ సీఎంను అడ్డుకోనున్నట్లు తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- మున్సిపల్ కమిషనర్ సతీష్



నవతెలంగాణ-నస్పూర్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నస్పూర్ మున్సిపల్ కమిషనర్ సతీష్ అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలోని పలు వార్డులలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నస్పూర్ పట్టణంలో వ్యాధుల నివారణకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలందరూ పరిసర ప్రాంతాల్లో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. అనంతరం 17వ వార్డులో కౌన్సిలర్ మేకల దాసుతో కలిసి డెంగ్యూ మలేరియా వ్యాధులకు కారణమవుతున్న, దోమల నివారణకు అవి వృద్ధి చెందకుండా ఉండడానికి కూలర్స్, టైర్స్, పాత ప్లాస్టిక్ సామాన్లు, డ్రమ్ములు మొదలగు వాటిలో నిలిచి ఉన్న నీరుని తొలగించారు. ఈ కార్యక్రమములో వైస్ చైర్మన్ గెల్లు రజిత పాల్గొన్నారు.

రొడ్డ చిన్న రమేశ్ 4వ వర్ధంతి



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ నాయకపుగూడలో శుక్రవారం ఆదివాసీ నాయకుడు రొడ్డ చిన్నరమేష్ 4వ వర్ధంతిని నిర్వహించారు. కుటుంబ సభ్యులు, ఆదివాసీ నాయకపోడ్ సేవా సంఘం గ్రామ, మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివాసీ నాయకపోడ్ సాంప్రదాయ ప్రకారం ఇంటి నుండి పూజా సామగ్రిని తీసుకొని సమాధి వద్దకు బయలుదేరి, పూజలు చేసి జెండా ఆవిష్కరించారు. అనంతరం రొడ్డ చిన్న రమేశ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఆనంతరం నాయకులు మాట్లాడుతూ ఆదివాసీ నాయకుడు రమేష్ జాతికి చేసిన సేవలను కొనియాడారు. ఆదివాసీలు ఐక్యతతో రమేష్ స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. అనంతనం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకపోడ్ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, మాజీ సర్పంచ్ ఆడే జంగు, ఆదివాసీ నాయకపోడ్ హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గంజి రాజన్న, తుడుందెబ్బ ఉపాధ్యక్షుడు సిడం శంకర్, సామాజిక చైతన్య వేదిక అధ్యక్షుడు పల్లె మల్లన్న పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని హెచ్ఏ వినోద్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని శంకర్‌గూడ గ్రామంలో డ్రై డేను నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నీటిని నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటిని ఉపయోగించే సిమెంట్ ట్యాంకులను శుభ్రపర్చాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 44 మంది ఓపీలను పరీక్షించారు. వైరల్ జ్వర బాధితులకు మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తిరుపతమ్మ, కమల, సూపర్‌వైజర్ విజయలక్ష్మీ, సందీప్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శనివారం | 31 ఆగస్టు, 2024 | www.navatelangana.com

నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-నార్నూర్



రోడ్డు సమస్యలను పరిష్కరించాలని నవతెలంగాణ ప్రచురించిన కథనానికి స్పందన లభించింది. గురువారం మండలంలోని గుండాల గ్రామపంచాయతీ పరిధిలోని మారుగూడ, సమత్‌నగర్ గ్రామానికి వెళ్లే రోడ్డు భారీ వర్షానికి అధ్వానంగా మారిన సందర్భంగా ఎంపీడీఓ జవహర్‌లాల్, ఎంపీఓ స్వప్నశీల మండలంలోని గ్రామపంచాయతీనీ సందర్శించి, బ్లేడ్ ట్రాక్టర్‌తో రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు.

మెయిన్ అంగన్‌వాడీ వేతనం వేయాలి

- సీఐటీయూ రాష్ట్ర నాయకులు దర్శనాల మల్లేష్
- డీడబ్ల్యుఓ కార్యాలయం ఎదుట ధర్నా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మినీ అంగన్‌వాడీలకు, ఆయాలకు టీచర్లుగా ప్రమోషన్ పొందిన వారందరికీ వేతనం వేయ్యాలని సీఐటీయూ రాష్ట్ర నాయకులు దర్శనాల మల్లేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం డీడబ్ల్యూఓ కార్యాలయంలో పలు డిమాండ్లతో కూడిన వినపతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 400 మంది మినీ అంగన్‌వాడీ టీచర్లు మేన్ అంగన్‌వాడీ టీచర్లుగా పనిచేస్తున్నారన్నారు. మినీ అంగన్‌వాడీ టీచర్లను ఆయాలు, మెయిన్ టీచర్లుగా ప్రమోషన్ జనవరి 2024లో చేశారని తెలిపారు. అప్పటి నుండి మేన్ టీచర్ల వేతనాలు రూ.13,650 రావాలి కానీ మార్చి, ఏప్రిల్, జులై ఈ మూడు నెలలలో రూ.7800 మాత్రమే వేశారన్నారు. డైరెక్టర్‌కు పలుమార్లు వినతిపత్రం ఇచ్చిన ఇప్పటి వరకు మినీ అంగన్‌వాడీలకు వేతనం వేయ్యాలేదన్నారు. గత ప్రభుత్వము మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌డీ ఆయాలు అనేక పోరాటాలు చేస్తే ఈ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు కావస్తున్న సమస్యలను పరిష్కారం చేసే విషయంలో విఫలమైందన్నారు. అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నడు ఐసీడీఎస్ మంత్రి సీతక్క మేము అధికారంలోకి వస్తే సమస్యలను పరిష్కారం చేస్తామని అనేక హామీలు ఇచ్చారన్నారు. చలో కమిషనర్ ధర్నా చేస్తే మంత్రి సీతక్క రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. టీచర్‌కు రూ.2 లక్షలు, ఆయకు రూ.1 లక్ష ఇస్తానని హామీ ఇచ్చి ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు



బొజ్జ ఆశన్న, ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కే.సునీత, జిల్లా అధ్యక్షురాలు డి. వెంకటమ్మ, జిల్లా కోశాధికారి రత్నమాల, నాయకురాళ్లు ముక్తా, పార్వతి, భారతి, హారిక, హంస, సురేఖ పాల్గొన్నారు.

సమయపాలన పాటించని రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-నార్నూర్

గాదిగూడ మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో సమయ పాలన పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఏఎస్‌యూ ప్రధాన కార్యదర్శి పెందూర్ సంతోష్ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ముందు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పది గంటలకు రావాల్సిన అధికారులు మధ్యాహ్నం 12 గంటలకు వచ్చి, రెండు గంటలకు తిరుగు ప్రయాణం చేస్తున్నారని అన్నారు. కార్యాలయానికి వచ్చే ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒక ఇన్ కం, క్యాస్ట్ సర్టిఫికెట్ల కోసం వారం రోజులుగా తిప్పుతున్నారని అన్నారు. డిపెండెంట్ కోసం డబ్బులు ఇస్తేనే, పనులు చేస్తున్నారని ఆరోపించారు. లేదంటే కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని తెలిపారు. వారి వెంట నాయకులు మరప గంగారాం, మెస్రం గోవింద్, కుంరం విలాస్, కోరంగా శంబు, మెస్రం సంతోష్, సత్యపాల్, లింగు, నాగరాజ్, కుంరం భీంరావు విద్యార్థి సంఘాల నాయకులు ఉన్నారు.

శివప్రసాద్ సేవలు మరువలేనివి



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని అడెల్లి తండాలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న కరిపే శివప్రసాద్ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. సమాజానికి, పాఠశాలకు వీరు చేసిన సేవలను మరువలేనివన్నారు. శేషా జీవితం సమాజానికి సేవ చేస్తూ అంకితమవ్వాలని, నిర్మల్ ఎంఈఓ శంకర్ తెలిపారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు విజయ, సంఘ నాయకులు మురళి మనోహర్‌రెడ్డి, తోడిశెట్టి రవికాంత్, వహీద్‌ఖాన్, లక్ష్మీప్రసాద్, ధర్మరాజ్, మొయిజుద్దీన్, శ్రీనివాస్, రవీందర్, రాజేందర్ పాల్గొన్నారు.

సదరం శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సెప్టెంబర్ 10 నుండి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించే సదరం శిబిరాలను అర్హత గల వారు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టెంబర్ 10న మూగ, చెవిటి, మానసిక వైకల్యం, 17న కంటి చూపు, 21, 24 తేదీలలో ఎముకల సమస్యలు ఉన్నవారికి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. శిబిరాలకు హాజరు అయ్యేవారు ప్రాథమిక ఆరోగ్య సేవా కేంద్రంలో వికలంగత్వ పరీక్ష చేయించుకుని స్లాట్ బుక్ చేసుకున్న తర్వాత నిర్ణీత తేదీలలో వికలంగత్వ ఆరోగ్య పరీక్ష పత్రాలతో సకాలంలో హాజరు కావాలని తెలిపారు. అర్హత గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలి



నవతెలంగాణ-జైపూర్

జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉంటూ ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని మండల వైద్యాధికారి ముస్తాఫా సూచించారు. భీమారం మండల కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేసిన ఆయన వర్షాకాలంలో కాచి వడబోసిన నీటిని మాత్రమే తాగాలని, వేడి ఆహారం తీసుకోవాలని సూచించారు. 58 మందిని పరీక్షించి 13 మంది నుండి రక్త నమూనాలు సేకరించినట్లు తెలిపారు. అదేవిధంగా 9 మంది జ్వరపీడితులకు డెంగ్యూ టెస్ట్ చేయగా వారికి నెగెటివ్ వచ్చినట్లు తెలిపారు. జ్వరం వచ్చిన, అస్వస్థతగా ఉన్నా వెంటనే ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాభివద్ధిపై ప్రత్యేక దృష్టి

- ఎమ్మెల్యే పాయల శంకర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

చదువు పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని భుక్తాపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆర్టికల్ 275 ద్వారా రూ.75 లక్షలతో నిర్మించనున్న డార్మెటిక్ భవనానికి భూమి పూజ చేశారు. గిరిజన విద్యార్థులకు మంచి చదువు అందించడంతో పాటు మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. బడ్జెట్లో విద్య అభివద్ధి కోసం కేటాయించిన నిధులు మంజూరు చేసి వాటిని ఖర్చు చేస్తామన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు నాయకులు, నాయకులు ప్రకాష్, ఆకుల ప్రవీణ్, సంతోష్, రఘుపతి, వేణుగోపాల్, లాలామున్న, సూర్యకిరణ్, శేఖర్, స్వామి రెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు ఐఎఫ్‌పీ ప్యానల్ టీవీలో బోధించాలి

- డీఈఓ పార్సి అశోక్



నవతెలంగాణ-సిర్పూర్(టి)

విద్యార్థులకు బోధన ఉపకారాలను బోధించాలని ప్రతి ఉపాధ్యాయుడు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని డీఈఓ పార్సి అశోక్ అన్నారు. శుక్రవారం మండలంలోని జడ్పీపీఎస్ సిర్పూర్, లోనవెల్లి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిర్పూర్ జడ్పీపీఎస్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు భౌతికశాస్త్రం చెప్పే పాఠాన్ని పరిశీలించారు. అనంతరం స్వయంగా భౌతిక శాస్త్రం పాఠాన్ని బోధించారు. విద్యార్థుల ప్రతిస్పందనను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలోని రిజిస్టర్లను రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్త చేశారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోనవెల్లి పాఠశాలని తనిఖీ సమయంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అనుమతి లేకుండా పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో ఐఎఫ్‌పీ ప్యానెల్ టీవీలలో బోధన చేయాలనీ ఉన్నప్పటికీ దాన్ని వాడకుండా నిరుపయోగంగా పడేయడానికి చూసి మండిపడ్డారు. రేపటిలోగా టీవీలని వాడకంలో తీసుకువచ్చే విధంగా చర్యలు చేయాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం ఇస్తూ వారానికి మూడు గుడ్లు అందించాలని ఇన్‌చార్జి హెచ్‌ఎం బండయ్యకు సూచించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోనవెల్లి పాఠశాల నిర్వహణ పట్ల అసంతృప్తి వ్యక్తపరిచారు. మళ్లీ అదే పాఠశాల పరిధిలో ఉన్న బాలుర ప్రాథమిక పాఠశాలని తనిఖీ చేయగా పాఠశాల ఫేషియల్ అటెండెన్స్ తీయకపోవడం, టైం టేబుల్, రికార్డ్స్, కరెంటు సౌకర్యం ఏవి లేకపోవడంతో ప్రధానోపాధ్యాయులపై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల గ్రాంటులను ఉపయోగించి వెంటనే కరెంటు పునరుద్ధరణ ఆదేశించారు. ఇదే రీతిలో విధులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫేషియల్ అటెండెన్స్ ఎండీఎం ఇతర రికార్డులను మైంటైన్ చేయడం ఎలాగో క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌ని తెలుసుకొని మైంటైన్ చేయాలని, కాంప్లెక్స్‌లో అన్ని పాఠశాలలు సమయపాలన పాటించాలన్నారు. ఆయన వెంట జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్, పీజీహెచ్‌ఎంలు ప్రమీల, సదాశివుడు, సీఆర్‌పీలు పవన్, రాజేష్ ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలి



నవతెలంగాణ-జైపూర్

ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేసిన వసతి గృహాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు రుచికరమైన భోజనం వడ్డించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు సూచించారు. మండల కేంద్రంలోని టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ బాలుర పాఠశాల, కళాశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట గది, విద్యార్థులకు అందజేస్తున్న భోజనం పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం, విద్యాబోధన వసతి గృహం నిర్వాహణ తీరును అడిగి తెల్సుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీలో పర్యటించిన పారిశుధ్య పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. అదేవిధంగా మండల పరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న ఎలక్టోరల్ రోల్స్ ఆన్‌లైన్ ప్రక్రియ పరిశీలించారు. తప్పులకు అవకాశం ఇవ్వకుండా ఓటరు లిస్టు తయారు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపు రావు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

- ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్‌రావుతో కలిసి సీపీ శ్రీనివాస్ అధికారులతో సమీక్ష

నవతెలంగాణ-జైపూర్

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పర్యటనకు సంబంధించి జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ అధికారలు ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్ర మంత్రులతో కలిసి ఎస్టీపీపీ పరిపాలన భవనం ప్రారంభోత్సవంతో పాటు ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్, సర్వీస్ బిల్డింగ్, మిథనాల్ ప్లాంట్ పనులను ఆయన పరిశీలించనున్నారు. ఈ మేరకు శుక్రవారం ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్ రావుతో పాటు ప్లాంట్ అధికారులు సమావేశమయ్యారు. ఈ సంధర్భంగా రామగుండం పోలీస్ కమీషనర్ శ్రీనివాస్ ఎస్టీపీపీని సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు. ప్లాంట్ ఆవరణలో ఏర్పాటు చేసిన పనులు, హెలీప్యాడ్, పరిపాలన భవనం, సర్వీస్ బిల్డింగ్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అదేవిధంగా జీఎం కో ఆర్డినేషన్ సుభాని డిప్యూటీ సీఎం పర్యటన ఏర్పాటు పరిశీలించారు. కార్యక్రమంలో జీఎం పీసీఎస్ శ్రీనివాసులు, చీఫ్



ఆఫ్ ఓఅండ్‌ఎం జెఎన్ సింగ్, ఏజీఎం సివిల్ కేఎస్ఎన్ ప్రసాద్, ఏజీఎం ఫైనాన్స్ సుధాకర్, ఏజీఎం ఈఅండ్‌ఎం మదన్మోహన్, డీజీఎం పర్సనల్ అజ్మీర తుకారాం, మేనేజర్ ఫారెస్ట్ చంద్రమణి, ఎస్ ఓ టు ఈడీ ప్రభాకర్, ఎస్ ఓ టూ జీఎం వెంకటయ్య, అధికారులు పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని, మండపాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు పోలీసుల అనుమతి తప్పనిసరని తీసుకోవాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గణేష్ మండపానికి ఏర్పాటు చేసే వారిలో ఒకరి పేరు ద్వారా పోలీస్‌పోర్టల్.టీఎస్‌పోలీస్.జీఓవీ.ఇన్ వెబ్సైట్ ద్వారా, ఏర్పాటు చేసే గణేష్ ప్రతిమ ఎత్తు, ఏర్పాటు చేస్తున్న ప్రదేశం, నిమజ్జనం తేదీ, ప్రదేశం మొదలైన సమాచారంతో రిజిస్టర్ చేసుకోవాలని, అదే పోర్టల్ ద్వారా మండపాల నిర్వహకులు పూర్తి వివరాలను నమోదుచేసుకోని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు.

సంక్షేమ పథకాల అమలుపై అవగాహన కలిగిఉండాలి

నవతెలంగాణ-జైపూర్

ప్రభుత్వం పరమైన సంక్షేమ పథకాల అమలు అవగాహణ కలిగి ఉండాలని విజిలెన్స్ జిల్లా మానిటరింగ్ కమిటి సభ్యులు పిల్లి వెంకటేశం సూచించారు. శుక్రవారం బెజ్జాల గ్రామంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల వారికి వివిధ అంశాలపై అవగాహణ కల్పించారు. ప్రతి నెల 30న వివిధ శాఖలకు చెందిన వారు పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహిస్తారని తెలిపారు. అంటరానితనం నిర్మూలన, బాల్య వివాహలు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహణ కల్పించారు. దళితులకు ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాలు, వసతులు వివరించారు. కాగా కులాంతర వివాహ ప్రోత్సాహం ద్వార రూ.2 లక్షల 50 వేలు ప్రభుత్వ పరంగా పొందవచ్చునని మంచిర్యాల జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రవిందర్ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన హెచ్‌ఎంకు సన్మానం



నవతెలంగాణ-దహెగాం

మండలంలోని బీబ్రా గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దుర్గం విస్తారు ఉద్యోగ విరమణ పొందడంతో శుక్రవారం పాఠశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికీ జిల్లా శాఖ విద్యాధికారి పి.అశోక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం దంపతులను సత్కరించి జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుడు దుర్గం విస్తారు 1986 నుండి 2024 వరకు అనేక సేవలను చేశారని, ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దారన్నారు. ఆయన సేవలు మరువ లేనివని కొనియాడారు. శేషజీవితం సుఖసంతోషాలతో గపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నబుబి బేగం, కే.జయేందర్, ఎ.సుదాకర్, డిజతులసీరాం, ఈ.రోహిత్, నజీర్, సీఆర్‌పీ శేఖర్, ప్రణీత, సృజన, మమత, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, బీబ్రా కాంప్లెక్స్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు అర్హత జాబిత విడుదల

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా ఉద్యోగానికై దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల అర్హత జాబితాను విడుదల చేసినట్టు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి తుకారాం భట్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో జాతీయ ఆరోగ్యమిషన్‌లో భాగంగా అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన అర్హత గల పోస్టుల నియామకానికి అభ్యర్థుల అర్హత జాబితాను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలోని నోటీసు బోర్డు, అదేవిధంగా వెబ్ సైట్ ఆసిఫాబాద్.తెలంగాణ.జీఓవీ.ఇన్‌లో పొందుపరిచినట్టు తెలిపారు. సెప్టెంబరు 2వ తేదీన ఒరిజినల్ సర్టిఫికెట్లతో జిల్లా కార్యాలయంలో ఎంపికైన వారు హాజరు కావాలన్నారు.

నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడాలి

నవతెలంగాణ-జైపూర్

ఇంటి పరిసరాల్లో నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపు రావు సూచించారు.. శుక్రవారం ఇందారం, రామారావుపేట్ గ్రామ పంచాయతీలను సందర్శించిన ఆయన పారిశుధ్య పనుల నిర్వాహణ తీరును పరిశీలించారు. గ్రామ పంచాయతీల పరిధిలో ప్లాస్టిక్ వ్యర్థాలు కన్పించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డులు పరిశీలించారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు దోమల మందు పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపం సాక్షిగా ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విషజ్వరాలతో జిల్లా ప్రజానీకం ముప్పతిప్పలు పడుతుంటే కనీసం పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగురామన్న అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. వందల సంఖ్యలో డెంగీ, మలేరియ కేసులు నమోదు అవుతున్నప్పటికీ ప్రభుత్వం మొద్దునిద్ర వీడడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో సీజనల్ వ్యాధుల కట్టడికి పటిష్ట చర్యలు తీసుకున్నామని, ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించి గిరిజనులకు అత్యుత్తమ వైద్య చికిత్సలు అందించేలా కృషి చేశామని గుర్తు చేశారు. విషజ్వరాల బారిన పడి ప్రజలు అల్లాడుతుంటే ఇన్‌చార్జి మంత్రి కనీసం అధికారులతో సమీక్ష నిర్వహించడం లేదని, క్షేత్రస్థాయిలో పర్యటించకుండా కేవలం ప్రకటనలకే పరిమితం అవుతున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ వైద్యుల కొరతతో సరైన చికిత్సలు అందడం లేదన్నారు. ఇకనైనా ఆదిలాబాద్ జిల్లాపై సవతి తల్లి ప్రేమను చూపించడం తాగదని తక్షణం ఆదిలాబాద్‌లో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి ఊరురుకు హెల్త్ క్యాంప్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సమన్వయ అధ్యక్షులు రోకండ్ల రమేష్, మాజీ మార్కెట్ చైర్మన్‌లు మెట్టు ప్రహ్లాద్, యాసం నర్సింగ్ రావు, ఇజ్జగిరి నారాయణ, పట్టణ అధ్యక్షులు అజయ్, సాజిదొద్దీన్, కుమ్ర రాజు, సేవ్వా జగదీష్, శ్రీనివాస్, గంగాధర్ పాల్గొన్నారు.